

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
# అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం    తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA    RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 09.09.2025 | సంపుటి : 2 | సంచిక :217 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI | Thuesday | 09.09.2025 | volume : 2 | Issue : 217 | Pages : 8 | Cost : 2/-




## నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక

ఎన్‌డిఏ అభ్యర్థిగా రాధాకృష్ణన్.. ఇండియా అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డి

ఉదయం పది గంటలకు పోలింగ్ ప్రారంభం

సాయంత్రం 5 వరకు జరుగనున్న పోలింగ్

సాయంత్రి 6 నుంచి ఓట్ల లెక్కింపు.. వెంటనే ఫలితం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 : జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవికి మంగళవారం ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో ఉపఎన్నికకు సర్వం సిద్ధమైంది. పార్లమెంటు ఉభయ సభల సభ్యులు ఈ ఎన్నికలో ఓటు వేస్తారు. ఈ ఎన్నికలను తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ బహిష్కరించింది. అలాగే ఒడిషాకు చెందిన బిజూ జనతా దళ్ కూడా ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించింది. పాలక ఎన్‌డిఎ తరపున మహారాష్ట్ర గవర్నర్ సీ.పీ. రాధాకృష్ణన్ (67), విపక్ష 'ఇండీ' కూటమి తరపున సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి (79) పోటీ చేస్తున్నారు.

మిగతా 3 లో

### ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో
## తటస్థంగా బీఆర్ఎస్

ఓటింగ్ దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు సమాచారం




03




# గోదావరితో హైదరాబాద్
# నీటి గోస తీరుస్తాం

ఎల్లంపల్లి శ్రీపాద నుంచి నీటిని తరలిస్తాం

ఇది కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం కానేకాదు

మూసీ ప్రక్షాళనన చేపట్టి తీరుతాం

మూసీ ప్రక్షాళనతో నల్లగొండకు ఊపిరి

తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్లను నిర్మిస్తాం

గోదావరి తాగునీటి సరఫరా పథకం శంకుస్థాపనలో సీఎం రేవంత్

హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీర్చడానికే గోదావరి తాగునీటి పథకం తీసుకొచ్చినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వరద నియంత్రణ కోసమే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలను నిర్మించారని అన్నారు. తాగునీటి సమస్యలు పరిష్కరించడానికే పీజేఆర్ పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మూసీ పునరుజ్జీవంలో భాగంగా.. ఉస్మాన్‌సాగర్ వద్ద చేపట్టిన గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టు పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 8 : దూరదృష్టితో ఆలోచించి ఈ ప్రాజెక్టులు కట్టడంతో నగర దాహం తీరుతోంది. నగరంలో జనాభా పెరుగుతోంది, ఉద్యోగాల కోసం హైదరాబా ద్ వస్తున్నారు. నగర జనాభా కోటిన్నరకు చేరింది. పీజేఆర్ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఖాళీ కుండలతో అసెంబ్లీ ముందు ధర్నాలు చేసి.. మంజీరా, కృష్ణా జలాలను హైదరాబాద్ తరలించారు. రాజ శేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నపుడు శ్రీపాద ఎల్లంపల్లి నీటిని తరలించడానికి శంకుస్థాపన చేస్తే 2014 నుంచి ఆ నీరు నగరానికి వస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

మిగతా 2 లో

### వంద రోజుల్లో మేడారం అభివృద్ధి పనులు

- బాసర, మేడారం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి



02




'సైడ్ ఇన్‌కమ్' ఉంటే
### బహిష్కరణ ముప్పు
వీసాదారులకు నిపుణుల అలర్ట్ 07



07

### భారత్ వంటి దేశాలపై ఆంక్షలు సరైన నిర్ణయమే : జెలెన్‌స్కీ




07

### గ్రూప్-1పై నేడు హైకోర్టు తీర్పు

### గండిపేటకు మీరు తెస్తున్నది
## కాళేశ్వరం జలాలు కాదా?

- ఈ ప్రాజెక్టు ద్వారా 240 టీఎంసీల నీటి వినియోగం జరిగింది
- మూసీ ప్రాజెక్టుపై ఉన్న తొందర.. హామీల అమలులో ఎందుకు లేదు?
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుబట్టే సిబిఐకి కాళేశ్వరం కేసు అప్పగించారని కెటిఆర్ తెలిపారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తుందని అన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఏమీ తేల్చలేదని కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. కాళేశ్వరం నీటిని వాడుకుంటూ ప్రాజెక్టును బద్నాం చేస్తున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేసినందుకు ప్రజలకు సిఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని అన్నారు.




హైదరాబాద్, సెప్టెంబర్ 8 : సీఎం రేవంత్‌రెడ్డి చేయనున్న మూసీ నది పునరుజ్జీవం శంకుస్థాపనపై మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. ఇవాళ కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆధారపడి గోదావరి జలాల పథకానికి శంకుస్థాపన చేస్తున్నారని చెప్పారు. శంకుస్థాపన చేయాల్సి వస్తే కొండపోచమ్మసాగర్ వద్ద చేయాలి.. లేదా మల్లన్నసాగర్ వద్ద చేయాలన్నారు. కానీ గండిపేట వద్ద చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కూలేశ్వరం అయిందన్న వారే గోదావరి జలాలను అక్కడి నుంచి తరలిస్తున్నారని, కాళేశ్వరం తెలంగాణకు కల్పతరువు అని తేలియిపోందని చెప్పారు. " కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ భయకరంగా విషం చిమ్ముతూ వచ్చింది. రాహుల్ విమర్శించే సీబీఐకి కేసు ఇవ్వడం.. కాళేశ్వరంపై రేవంత్‌రెడ్డికి

మిగతా 2 లో



## 21 నుంచి దసరా సెలవులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్లకు దసరా సెలవులను ప్రకటించింది. దసరా పండుగ నేపథ్యంలో సెప్టెంబర్ 21వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకూ పాఠశాలలకు సెలవులు ఇచ్చింది. అదే విధంగా జూనియర్ కాలేజీలకు సెప్టెంబర్ 28వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకూ సెలవులు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

### ఆర్థిక సంక్షోభం సృష్టించిన
## ఘనుడు కేసీఆర్



- పాలనా పరంగా రాష్ట్రాన్ని నాశనం చేసిన బిఆర్ఎస్
- మేడిగడ్డ కుంగిందని చెబితే ఎదురుదాడి
- ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చరిత్రలో నిలుస్తుంది
- రాహుల్‌ను ప్రధాని చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి
- టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో భట్టి విక్రమార్క

హైదరాబాద్, సెప్టెంబర్ 8 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణలో ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించారని డిప్యూటీ–సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వంపై భట్టి విక్రమార్క మరోసారి నిప్పులు చెరిగారు. పాలన పరంగా రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పార్టీ నాశనం చేసిందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మేడిగడ్డ అంశంపై తాము మాట్లాడితే.. కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తోందంటూ బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారని తెలిపారు.

మిగతా 2 లో

### తలసరి ఆదాయంలో తెలంగాణ ఫస్ట్
- వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో ముందంజ

అధిక ధరలతో ఆందోళన చెందుతున్న సామాన్యులకు కేంద్రం సవరించిన జీఎస్టీ భారం ఊరట కలిగిస్తుంది. కొత్తగా జీఎస్టీ మూడు స్లాబులుగా విభజించారు. పాత విధానంలో ఉన్న 12శాతం, 28శాతం స్లాబులను పూర్తిగా తీసివేస్తూ.. 5శాతం, 18శాతంతో పాటు విలాసవంతమైన వాటిపై 10శాతం జీఎస్టీని చేర్చుతూ కొత్త సంస్కరణలకు కేంద్రం తీసుకువచ్చింది. దీంతో వాహనరంగంలో మార్పులు కానరానున్నాయి.

04

### వాహన కొనుగోలుదారులకు
# దసరా బొనాంజా

జిఎస్టీ తగ్గించడంతో ఆగిపోయిన క్రయవిక్రయాలు

దసరా నాటికి కొత్త వాహనాల కోసం ఎదురు చూపు





# వంద రోజుల్లో మేడారం అభివృద్ధి పనులు

- బాసర, మేడారం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** మేడారం, బాసర ఆలయాలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మేడారం అభివృద్ధి పనులను వంద రోజుల్లో పూర్తి చేయాలని, ఈ వారంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని అధికారులకు తెలిపారు. జాతరకు సమయానికి ఆలయ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. మేడారం, బాసర ఆలయాల అభివృద్ధి ప్రణాళికలపై సీఎం రేవంత్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మేడారం అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్‌లను సీఎం పరిశీలించారు. మేడారం మహాజాతర నాటికి భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. పూర్తిగా సహజసిద్ధమైన రాతి కట్టడాలతో నిర్మాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యంగా ఉండేలా ప్రవేశద్వారాలు, బయటకు వెళ్లే దారులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంపన్న వాగులో నీరు నిలిచేలా చెక్‌డ్యాములు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయ విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక నిపుణులు, పూజారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# గోదావరితో హైదరాబాద్ నీటి గోస తీరుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, నల్గొండ జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు మూసీ నదిని ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరారని తెలిపారు. సమస్యలు ఉన్నప్పటికీ సమన్వయంతో ముందుకెళుతున్నామని, తాగునీరు అందించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎవరు అడ్డుపడ్డా ఈ పథకం పూర్తిచేస్తామని చెప్పారు. నల్గొండ ప్రజల కోసమే మూసీ ప్రక్షాళన చేపడుతున్నామన్నారు. ఈ పథకం ద్వారా హైదరాబాద్ తాగునీటి సమస్య మాత్రమే కాకుండా, నల్గొండ ఫ్లోరైడ్ సమస్య కూడా తీరుతుందని తెలిపారు. భారత రాష్ట్ర సమితి వల్లే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగకూడదో వారు చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలో మహారాష్ట్రకు వెళ్లి అక్కడి సీఎంను కలుస్తామన్నారు. సబర్మతి, యమునా, గంగా నది ప్రక్షాళన జరిగిందనేది వాస్తవమే కాని, మూసీ నది ప్రక్షాళన జరగకూడదా? అని ప్రశ్నించారు.



### రెండేళ్లలో పనులు పూర్తయ్యేలా..

రూ.7,360 కోట్లతో హ్యామ్ విధానంలో పనులు చేపడతామని, రెండేళ్లలో పనులు పూర్తయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నల్గొండ జిల్లాలో మూసీ నది కాలుష్యానికి మారు పేరుగా మారిందని, ఆ నీరు తాగి పశువుల ప్రాణాలే కాకుండా మనుషుల ప్రాణాలు కూడా పోతున్నాయని అన్నారు. మూసీ నది నీటి వల్ల ఆడబిడ్డలకు పురిటి సంబంధిత సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. నల్గొండ జిల్లాలో పర్యటించినప్పుడు అక్కడి పరిస్థితిని చూసి మూసీ ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. హైదరాబాద్ నగరంలోని డ్రైనేజీల నీరు, కంపెనీల కాలుష్యం మూసీలో కలవకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఆ నీటిని శుద్ధి చేసేందుకు ఎస్టీపీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. "గేట్‌వే ఆఫ్ ఢిల్లీ, గేట్‌వే ఆఫ్ ముంబై ఉంది. ఇప్పుడు గేట్‌వే ఆఫ్ హైదరాబాద్ కూడా ఉంటుంది. హైదరాబాద్ అభివృద్ధికి అందరూ కలిసి రావాలి. అందుకు అందరి సహకారం కావాలి. రాబోయే రోజుల్లో లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పనిచేద్దాం. ఎవరు అడ్డుకున్నా మన ప్రభుత్వం తిప్పికొడుతుంది. ఇది ఇందిరమ్మ రాజ్యం, పేదోళ్ల రాజ్యం. పేదోళ్లకు న్యాయం జరుగుతుందని నేను నమ్ముతున్నాను" అన్నారు.

### గోదావరి నీటిని తీసుకురావడానికి ప్రణాళికలు

2014 నుంచి బీఆర్ఎస్ ఒక్క చుక్క నీటిని నగరానికి తీసుకురావాలన్న ఆలోచన కూడా చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక గోదావరి నీటిని తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందించి ముందుకు వెళ్తున్నామని తెలిపారు. "ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కట్టి 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. "అప్పుడు ఐటీ మంత్రిగా ఉన్న వ్యక్తి నగరానికి వచ్చే నీటిని నెత్తిపై వేసుకున్నాడు. కానీ ఆయన నీళ్లు చల్లుకున్నంత మాత్రాన చేసిన పాపాలు పోవు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వివిధ ప్రాజెక్టుల నుంచి నగరానికి నీళ్లు తీసుకువచ్చారు. తిరిగి మేము అధికారంలోకి వచ్చాక గోదావరి నీళ్లను తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందించి ముందుకు వెళ్తున్నాం. ఒక వ్యక్తి తాడిచెట్టు లాగా పెరిగాడు కానీ ఎటువంటి లాభం లేదు. గోదావరి జలాలు కాళేశ్వరం నుంచే వస్తున్నాయని అంటున్నారు. కానీ వాళ్లు కట్టిన కాళేశ్వరం ఇప్పుడు కూలేశ్వరం అయింది. శ్రీపాద ఎల్లంపల్లిని తాత ముత్తాతలు కట్టలేదు. గోదావరి జలాలు నగరానికి వస్తున్నాయంటే శ్రీపాద ఎల్లంపల్లి మూలం. కాకా సూచన మేరకు ప్రాణహిత చేవెళ్లకు అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుగా అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డి నామకరణం చేశారు. చేవెళ్లలో రాజశేఖర్ రెడ్డి వేసిన శిలాఫలకం ఇంకా ఉంది. కానీ దాన్ని ఆపి రంగారెడ్డి జిల్లాకు అన్యాయం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు వద్ద 152 మీటర్ల ఎత్తులో నిర్మించాలంటే, 149 మీటర్లకు మాత్రమే అనుమతించారు. గోదావరి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పూర్తిచేసి 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం. చేవెళ్ల, పరిగి, వికారాబాద్‌కి నీళ్లు తీసుకువస్తామని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

## కొండారెడ్డిపల్లిలో రోడ్డు విస్తరణ

### సిఎం ఇంటి కాంపౌండ్ కూల్చివేత

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8 :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారు. రోడ్డు విస్తరణలో భాగంగా సీఎం ఇంటి కాంపౌండ్‌ను అధికారులు కూల్చారు. ఇందుకు సీఎం అడ్డుచెప్పక పోగా.. ఒక్క మాట కూడా మాట్లాడలేదు.సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం అయిన కొండారెడ్డిపల్లిలో రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా అధికారులు ముఖ్యమంత్రి ఇంటి కాంపౌండ్‌ను కూల్చారు. ఇంటి చుట్టూ ఉన్న కాంపౌండ్ వాల్ మొత్తంను పడగొట్టారు. ఇందుకు సీఎం సహా ఆయన కుటు-ంబ సభ్యులు ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియా వైరల్ అయ్యాయి. విషయం తెలుసుకున్న జనాలు రేవంత్ రెడ్డిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి అందరికీ ఆదర్శం', 'సీఎం తల్చుకుంటే అక్కడ రోడ్డు వేయడాన్నే ఆపేవారు, కానీ ఆలా చేయలేదు', 'ప్రజల శ్రేయస్సే సీఎం కోరుకున్నారు' అని కామెంట్స్ చేస్తున్నారు.

## ఆర్థిక సంక్షోభం సృష్టించిన ఘనుడు కేసీఆర్

- పాలనా పరంగా రాష్ట్రాన్ని నాశనం చేసిన బిఆర్ఎస్
- మేడిగడ్డ కుంగిందని చెబితే ఎదురుదాడి
- ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చరిత్రలో నిలుస్తుంది
- రాహుల్‌ను ప్రధాని చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి
- టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో భట్టి విక్రమార్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణలో ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించారని డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వంపై భట్టి విక్రమార్క మరోసారి నిప్పులు చెరిగారు. పాలన పరంగా రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పార్టీ నాశనం చేసిందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మేడిగడ్డ అంశంపై తాము మాట్లాడితే.. కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తోందంటూ బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారని తెలిపారు. మేడిగడ్డ కుంగిందని వాస్తవాలు చెప్పిన కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్ నేతలు తప్పుపడుతున్నారన్నారు. హరీష్ రావు, సంతోష్ రావులు కాళేశ్వరం ప్రాజెక్టులో దోచుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో దోచుకోవడం వల్లే.. కేసీఆర్ రెండో సారి తన కేబినెట్‌లో హరీశ్ రావును అవకాశం ఇవ్వలేదని ఆయన వివరించారు. తెలంగాణలో పాలనతోపాటు ఆర్థిక పరంగా గాడిన పెడుతున్నామని చెప్పారు. పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ కార్యక్రమం చరిత్రలో నిలిచి పోతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. అధికారంలోకి రాగానే రుణ మాఫీ చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు- రైతు భరోసా కింద ఇచ్చామన్నారు. దేశంలోనే రైతులకు ఏ రాష్ట్రం చేయని విధంగా తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ చేసిందని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. దాదాపు రూ. లక్ష కోట్లు- సంక్షేమ కోసం ఖర్చు చేసిందన్నారు. ఎన్నికల ముందు రాహుల్ గాంధీ కుల గణన చేస్తామన్నారని.. ఆ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కుల గణన చేసి చూపించామని డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇక స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల కోసం బిల్లులు తీసుకొని వచ్చామన్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. రిజర్వేషన్లకు ముకుతాడు వేసిందని విమర్శించారు. ఎల్లంపల్లి, నెట్టెంపాడు ,శ్రీశైలం, నాగార్జున సాగర్, దేవాదుల ప్రాజెక్టులు మనమే నిర్మించామని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం దేశానికి చాలా అవసరమని భట్టి విక్రమార్క అన్నారు. అందరం కలిసికట్టు-గా పనిచేసి రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ లేదా ప్రభుత్వ పదవిలో ఏదో ఒకటి తప్పకుండా వస్తుంది. కాంగ్రెస్ పార్టీ అజేయంగా ఉండేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేపట్టే ప్రతి పనికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ అంతా అండగా ఉంటుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించేందుకు, సవాళ్లను ఎదుర్కొని న్యాయం చేసేందుకు ముందుకు వెళ్తున్నాం. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ పరిమితిని భారత రాష్ట్ర సమితి పెట్టింది. 42 శాతం రిజర్వేషన్ బిల్లును భాజపా రాష్ట్రపతి దగ్గర ఆపింది. ఈ విషయంలో భారత రాష్ట్ర సమితి, భాజపా కుట్ర దాగి ఉందని భట్టి విమర్శించారు.

## గండిపేటకు మీరు తెస్తున్నది కాళేశ్వరం జలాలు కాదా?



(మొదటిపేజీ తరువాయి)

ఉన్న కక్షకు నిదర్శనం. సీఎం, ప్రభుత్వ వైఖరి అందరికీ అర్థమవుతోంది. గండిపేటకు తీసుకొస్తున్నది కాళేశ్వరం జలాలా? కాదా? సమాధానం ఇవ్వాలి. కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసినందుకు సీఎం క్షమాపణ చెప్పాలి. ఈ ప్రాజెక్టు ద్వారా 240 టీఎంసీల నీటి వినియోగం జరిగిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. బనకచర్లకు నీరు పోవాలని మేడిగడ్డను పక్కన పెట్టేశారు. రూ.1,100 కోట్ల ఖర్చుతో కొండపోచమ్మ నుంచి మూసీకి నీరు తెచ్చేలా 2023 మే 17న కేసీఆర్ ప్రభుత్వం కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంది. కొండపోచమ్మనుంచి గ్రావిటీ ద్వారానే గండిపేటకు నీరు వస్తుంది. హుస్సేన్‌సాగర్‌కు కూడా గోదావరి జలాలు తీసుకురావాలని ప్రతిపాదించాం. రూ.1,100 కోట్లతో అయ్యే పనిని కొండపోచమ్మ నుంచి మల్లన్నసాగర్‌కు మార్చి ఏడు రెట్లు పెంచారు. ఎవరి కోసం ఈ అంచనాలు పెంచారు? కమీషన్ల కోసమా? మొబిలైజేషన్ అడ్వాన్సుల కోసమా? కాంట్రాక్టర్ల కోసమా?రూ.1,100 కోట్ల నుంచి 7,400 కోట్లకు పెరగడం స్కాం కాదా? ఇందులో అవినీతి కోణంతోపాటు క్రిమినల్ కోణం కూడా ఉంది.

### హామీల అమలులో తొందర ఎందుకు లేదు?

సుంకిశాలలో బ్లాక్ లిస్టు చేయాల్సిన ఏజెన్సీకి మళ్లీ రూ.7,400 కోట్ల పనులు అప్పగించారు. ఎందుకు ఆ సంస్థపై అంత ప్రేమ? చర్యలు తీసుకోవాల్సింది పోయి.. రివార్డు ఇస్తారా? కేంద్ర ప్రభుత్వం బ్లాక్ చేస్తే మీకెందుకు మొహమాటం? రూ. వేల కోట్ల ముడుపులు దిల్లీకి పంపి సీటును కాపాడుకోవడం తప్ప ఇంకోటి లేదు. మూసీ ప్రాజెక్టులో విడతల వారీగా దోపిడీ జరుగుతోంది. మూసీలో 300 ఎకరాలు ఇచ్చేందుకు ఓ సంస్థతో మాట్లాడుకున్నారు. మూసీ ప్రాజెక్టుపై ఉన్న తొందర.. హామీల అమలులో ఎందుకు లేదు? ఓఆర్ఆర్ చుట్టూ రింగ్ మెయిన్ 50 కి.మీ పూర్తి చేశాం. కేసీఆర్ మళ్లీ సీఎం అయ్యాక అది పూర్తి చేసి తీరుతాం. 24 గంటల మంచినీటి సరఫరా వచ్చే ఎన్నికల్లో మా హామీ. కవిత విషయంపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకున్నాం. ఆ అంశంలో ఇంక మాట్లాడటానికి ఏమీ లేదు. రాష్ట్రంలో లక్షల మంది రైతులు ఎరువుల కోసం క్యూ లైన్లలో ఉన్నారు. యూరియా ఇచ్చిన వారికి ఓట్లు వేస్తామని చెప్పాం. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు వ్యక్తిగతంగా మంచివారు. కానీ, వారు కాంగ్రెస్, భాజపా తరఫున పోటీ చేస్తున్నారు. ఆ రెండు పార్టీలు తెలంగాణ రైతులను వేధింపులకు గురిచేస్తున్నాయి. నోటా లేదు కాబట్టి ఉపరాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉండాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు." అని కేటీఆర్ అన్నారు.

### పార్టీ నిర్ణయం మేరకే కవిత సస్పెన్షన్

మాజీ ఎమ్మెల్సీ కవితను పార్టీ బిఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడం పార్టీ అధినేత కెసిఆర్ నిర్ణయమని వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. అందరితోఓ చర్చించి తీసుకున్న నిర్ణయమని అన్నారు. సస్పెన్షన్ చేసిన తర్వాత కవిత తన ఎమ్మెల్సీ పదవికి, పార్టీ ప్రధాన సభ్యత్వానికి కూడా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ విషయంపై కవిత సోదరుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తొలిసారిగా స్పందించారు. పార్టీలో చర్చించిన తర్వాతే పార్టీ అధినేత కెసిఆర్ ఆ నిర్ణయం తీసుకున్నారని కెటిఆర్ స్పష్టం చేశారు.



## మహిళా ఆర్చర్ చికితకు సిఎం రేవంత్ అభినందన

### బంగారు పతకం సాధించేలా శిక్షణకు హామీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** మహిళా ఆర్చరీ ఛాంపియన్ చికిత తనిపర్తిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చికిత తనిపర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. కెనడాలో జరిగిన 2025 యూత్ వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున బంగారు పతకం గెలుచుకున్న తొలి మహిళగా చికిత తనిపర్తి రికార్డు సృష్టించారు. ఈ నేపథ్యంలో సీఎంను ఆమె కలిశారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించేందుకు ప్రభుత్వం తరపున పూర్తి శిక్షణ అందించేందుకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని చికితకు సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఇటీవల చైనాలోని షాంఘైలో జరిగిన సీనియర్ వరల్డ్ కప్ జట్టు- రజత పతకాన్ని ఆమె సాధించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ రమణారావు, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, రాజేందర్ రావు తదితరులు చికిత వెంట ఉన్నారు.

## తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణం

- డీపీఆర్, ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- మహారాష్ట్రతో చర్చల కోసం షెడ్యూల్ ఖరారు
- అధికారులను ఆదేశించిన మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. తుమ్మిడిహట్టి కోసం సవరించిన డీపీఆర్, ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, మహారాష్ట్రతో చర్చల కోసం షెడ్యూల్ ఖరారు చేయాలని అధికారులకు సూచించారు. నీటిపారుదలశాఖ అధికారులతో ఉత్తమ్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. బ్యారేజీల భద్రత, వినియోగాన్ని నిర్ధరించేందుకు వర్షాకాలం ముందే చర్యలు తీసుకుంటున్నట్లు- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అన్ని ప్రాజెక్టుల్లో దశలవారీగా పూడిక తీతకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉత్తమ్ సూచించారు.సమ్మక్క-సారక్క ఆనకట్ట విషయంపై ఈ నెల 23న టీఏసీ సమావేం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నివేదిక సమర్పించడంతోపాటు- ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ కోసం ప్రయత్నించాలని అధికారులకు సూచించారు. పీఎంకేఎస్‌వై పథకం ద్వారా నిధుల కోసం కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణలో ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం ముందుకెళ్తామని అన్నారు. వరద తగ్గిన వెంటనే ఐఐటీ-లాంటి సంస్థలతో పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. పాలమూరు, రంగారెడ్డి, జూరాల, కల్వకుర్తి ప్రాజెక్టులను ప్రాధాన్యంగా పరిగణించాలి. 4 ప్రాజెక్టుల భూ సేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు, పెండింగ్ సమస్యలపై దృష్టి సారించాలి. డిండి, ఎస్ఎల్‌బీసీ, పెండ్లిపాక, నక్కలగండి, కొడంగల్-నారాయణపేట ప్రాజెక్టుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. భూసేకరణ వేగవంతం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. దేవాదుల ప్రాజెక్టు 3, 6 ప్యాకేజీల



పనులు వేగవంతం చేయాలి. తదుపరి కేబినెట్ సమావేశానికి పురోగతి నివేదిక సమర్పించాలి.మరోవైపు ఎస్ఎల్‌బీసీ పనుల కోసం హెలిబోర్న్ సర్వే విషయంపై ఎన్జీఆర్ఐ, హిమాలయన్ హెలీ సర్వీసెస్, జేపీ అసోసియేట్స్ ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ వద్ద 2 హెలిప్యాడ్‌లను సర్వే కోసం ఉపయోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. డీజీసీఏ, ఇతర అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. క్షేత్రస్థాయి అధ్యయనాలు కొనసాగించాలన్నారు.

## అందుబాటులోకి కోకాపేట్ నియోపోలీస్ ట్రంపెట్

### లాంఛనంగా ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** కోకాపేట వద్ద నియో పోలిస్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్‌ను సోమవారం నాడు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. హెచ్ఎండీఏ నిర్మించిన నియోపోలిస్, కోకాపేట్ ప్రాంతాన్ని ఔటర్ రింగ్ రోడ్డుకు కనెక్ట్ చేస్తూ ట్రంపెట్‌ను నిర్మించారు. నియో పోలిస్ ప్రాంతంలో భారీగా రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టులు నిర్మితమవుతున్నాయి. దీంతో నియోపోలిస్, కోకాపేట ప్రాంతంలో భారీగా ఐటీ-కంపెనీలు తరలి రానున్నాయి. ఫ్యూచర్ ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ ట్రంపెట్ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ ట్రంపెట్ జంక్షన్‌తో మోకిల, శంకర్‌పల్లి ప్రాంతాలకు ట్రాఫిక్ కష్టాలు తప్పనున్నాయి. నియో పోలిస్ నుంచి ట్రంపెట్ ద్వారా 20 నిమిషాల్లో ఎయిర్ పోర్ట్ చేరుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. అలాగే నియోపోలిస్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలికి ఈజీగా కనెక్టివిటీ- ఉంటుందని పేర్కొంటు-న్నారు. ఓఆర్ఆర్‌కు కనెక్ట్ చేసేందుకు నియోపోలిస్ వద్ద ట్రంపెట్‌కి రెండు చోట్ల టోల్ గేట్స్ ఏర్పాటు చేశారు. ఈ నియో పోలిస్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో.. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితోపాటు- పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. కోకాపేట వద్ద నియో పోలీస్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని స్థానికులు కలిసి అభినందనలు తెలిపారు. దీంతో ఆయన వారికి అభివాదం తెలిపారు.

## తలసరి ఆదాయంలో తెలంగాణ ఫస్ట్

- వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో ముందంజ
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో తెలంగాణ తొలి స్థానంలో ఉందని చెప్పారు. కర్ణాటక, హరియాణాను అధిగమించి తెలంగాణ రికార్డు సాధించిందని పేర్కొన్నారు. వార్షిక రుణ ప్రణాళికలో రాష్ట్రం మొదటి క్వార్టర్‌లోనే 33.64 శాతం సాధించింది. ఇందిరమ్మ ఇళ్లకు, స్వయం ఉపాధి పథకాలకు రుణాలు ఇవ్వాలి. వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు ఇవ్వండి. ఆస్తుల తాకట్టు-, ఫిక్స్‌డ్ డిపాజిట్ల పేరుతో రైతులను ఒత్తిడి చేయవద్దన్నారు. వ్యవసాయ రంగాన్ని ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావిస్తున్నాం. అన్నదాతల పక్షాన రుణమాఫీ, రైతుభరోసా పేరిట బ్యాంకులకు రుణాలు జమ చేశాం. రూ.30 వేల కోట్లు- రైతుల పక్షాన బ్యాంకులకు రాష్ట్రప్రభుత్వం జమ చేసింది. బ్యాంకింగ్ రికవరీ చరిత్రలో ఇది ఒక రికార్డు అని భట్టి విక్రమార్క తెలిపారు.

# కేంద్రం కావాలనే యూరియా కుట్రలు

- బీజేపీతో బీఆర్ఎస్ లోపాయకారి మద్దతు
- రైతులు ఆందోళన చెందుతున్నా కేంద్రం రాజకీయం
- మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎటువైపో చెప్పాలని డిమాండ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** కేంద్ర ప్రభుత్వం యూరియా ఇవ్వలేదని, అందుకే రాష్ట్రంలో సమస్యలు ఉత్పన్నమయ్యాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే యూరియా కొరత ఏర్పడిందని ఆరోపించారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావుకి ఎరువుల గురించి ఏమాత్రం అవగాహన లేదని విమర్శించారు. రాంచందర్‌రావు సోయిలేకుండా మాట్లాడుతున్నారని విమర్శిస్తూ, "ఆయనకు రాజకీయ విమర్శలంటే తప్ప రైతుల సమస్యలు పట్టవా?" అని ప్రశ్నించారు. "యూరియా కోసం ఎప్పుడైనా మీరు కేంద్రాన్ని అడిగారా?" అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు యూరియా విషయంలో కేంద్ర పెద్దలను కలసి విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. యూరియా ఉత్పత్తి, సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉందని పేర్కొన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రైతు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల రైతులు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో యూరియా కొరతను బీజేపీ, బీఆర్ఎస్‌లు ఆసరాగా తీసుకొని రైతుల్లో ఆందోళన సృష్టిస్తున్నారని ఆరోపించారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఉత్పత్తిని ఉద్దేశపూర్వకంగా ఆపేశారని చెప్పారు.

### రైతులు రాష్ట్ర ప్రభుత్వంపై విరక్తి చెందాలనే కుట్ర

తెలంగాణ బీజేపీ ఎంపీలు యూరియా కొరతకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. యూరియా సమస్యను పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి చేస్తున్నారని చెప్పారు. సంబంధిత కేంద్ర మంత్రి ఎరువుల అంశంపై స్పందించాలన్నారు. కేంద్రం స్పందించకపోతే, కాంగ్రెస్ పార్టీ తరఫున ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఎరువుల కొరత వల్ల రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఈ విషయంలో కేంద్రం తెలంగాణ పట్ల వివక్ష చూపుతోందని విమర్శించారు. ఎరువుల తయారీ, సరఫరా పూర్తిగా కేంద్ర పరిధిలో ఉండగా, రైతులు రాష్ట్ర ప్రభుత్వంపై విరక్తి చెందాలనే కుట్ర కేంద్రానికి ఉందని అన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కయి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎరువుల కొరత వాస్తవమేనని చెప్పారు. అయితే బాధ్యత వహించాల్సిన వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఎరువుల విషయమై ఏ అధికారాలు లేవని స్పష్టం చేశారు.

### 5.2 లక్షల టన్నుల ఎరువులే వచ్చాయి

రామగుండం ఎరువుల కర్మాగారంలో నాలుగు నెలలుగా ఉత్పత్తి నిలిపివేశారని ఆరోపించారు. ఎరువుల తయారీ మళ్లీ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి 11 లక్షల టన్నుల అవసరముంటే, కేవలం 5.2 లక్షల టన్నుల ఎరువులే వచ్చాయని తెలిపారు. ఎరువుల కొరతపై పూర్తి బాధ్యత బీజేపీకే ఉంటుందని, రాజకీయ కక్షతో రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై ముట్టడించరాదని సూచించారు. రైతుల మద్దతుతో బీజేపీకి వ్యతిరేకంగా ఒత్తిడి తీసుకురాగలమని హెచ్చరించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు ఎటువైపో చెప్పాలని బీఆర్ఎస్‌ను పొన్నం ప్రభాకర్ ప్రశ్నల వర్షంతో నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ–బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.

# ట్రంప్ పాదరసంలాంటి వాడు

- ఎప్పుడు ఎలా మాట్లాడుతాడో చెప్పలేం
- ట్రంప్ వ్యాఖ్యలపట్ల జాగ్రత్తగా ఉండాలి
- కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ సూచన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 :** ట్రంప్ పాదరస స్వభావం కలిగిన వ్యక్తి అని థరూర్ కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అభివర్ణించారు. అధ్యక్షుడు, ఆయన సిబ్బంది చేసిన అవమానాలు చాలా ఉన్నాయన్నారు. భారత్, అమెరికా సంబంధాలపై ట్రంప్ సానుకూలంగా మాట్లాడగానే ప్రధాని నరేంద్రమోదీ స్పందించ డంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని త్వరగా స్పందించినప్పటికీ, రెండు దేశాల ప్రభుత్వాలు, దౌత్యవేత్తలు చేయాల్సిన తీవ్రమైన మరమ్మతులు మిగిలే ఉన్నాయన్నారు. ట్రంప్ కొత్త స్వరాన్ని జాగ్రత్తగా స్వాగతిస్తున్నామని తెలిపారు. భారతీయులు ఎదుర్కొన్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ట్రంప్ వల్ల కలిగిన బాధ, అవమానాన్ని త్వరగా మర్చిపోలేమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చాలా త్వరగా స్పందించారు. సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం అనే ప్రాథమిక సంబంధం గురించి విదేశాంగ మంత్రి కూడా నొక్కి చెప్పారు. అది ఇప్పటికీ అలాగే ఉంది. అదే మనం ఇవ్వాల్సిన ముఖ్యమైన సందేశం. రెండు దేశాల ప్రభుత్వాలు, దౌత్యవేత్తలు కలిసి పరిష్కరించుకోవాల్సిన తీవ్రమైన అంశాలు కొన్ని ఉన్నాయని నేను భావిస్తున్నాను. ట్రంప్(ఉ÷ఎశ ÷ుసషపూ) కొత్త స్వరాన్ని జాగ్రత్తగా స్వాగతిస్తున్నాను. భారతీయులు ఎదుర్కొన్న వాస్తవ పరిణామాలు చాలా ఉన్నాయి. కాబట్టి అంత త్వరగా క్షమించలేరు. ఆ పరిణామాలను అధిగమించాల్సి ఉందని థరూర్ మాట్లాడారు. ?భారత్ విషయంలో తప్పు చేశానని ట్రంప్‌నకు అర్థమైంది కాబట్టే స్వరం మార్చారని ఇండియా మాజీ దౌత్యవేత్త కేపీ ఫాబియన్ అన్నారు. దూకుడుగా ముందుకెళ్లి తప్పుచేసినట్లు ట్రంప్ గ్రహించారని పేర్కొన్నారు. రష్యా చమురుకొంటే 25 శాతం అదనపు సుంకం విధించడం ట్రంప్‌నకు ఆశించిన ఫలితం ఇవ్వలేదన్నారు. 'ట్రంప్ వ్యాఖ్యలకు తగినట్లు–గా ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. కానీ, దీనితోనే వివాదం ముగిసిపోయిందనే నిర్ధరణకు రాకూడదు. ఇండియా ఎప్పటికీ ఇండియాగానే ఉంటు–ంది. ఇండియా నాగరిక దేశం. భారత్ మరే ఇతర దేశాన్ని అనుసరించదు. ప్రతిఒక్క దేశంతో స్నేహ సంబంధాలు కోరుకుంటు–ంది. వ్యాపారం చేస్తుంది. కానీ, ఇతరుల ఆదేశాలకు తలొగ్గదు' అని ఫాబియన్ చెప్పారు.





# ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తటస్థంగా బీఆర్ఎస్

### ఓటింగ్ దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు సమాచారం

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బిఆర్ఎస్ ఎవరికి ఓటేయాలో తేల్చుకోలేక పోయింది. దీంతో నేడు జరుగనున్న భారత ఉప రాష్ట్రపతి ఎన్నికలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ ఒక నిర్ణయానికి వచ్చినట్టు–తెలుస్తోంది. ఎన్డీఏ, ఇండియా కూటమి.. రెండూ తెలంగాణకు ద్రోహం చేశాయంటోన్న బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో తటస్థ వైఖరి అవలంభించాలని చూస్తున్నట్టు– సమాచారం. ఉప రాష్ట్రపతి ఎన్నికలకు దూరంగా ఉండాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్టు, ప్రస్తుతం దేశ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇదే సరైన నిర్ణయమని బీఆర్ఎస్ అధినేత భావిస్తున్నట్టు–గా ఆ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. దీనికి సంబంధించి నేడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధికారికంగా ప్రకటన చేసే అవకాశం ఉంది. బీఆర్ఎస్ కు రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్న సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ తాజా నిర్ణయంతో తెలంగాణ కాంగ్రెస్ అగ్గి మీద గుగ్గిలమవుతోంది. బీఆర్ఎస్ బీజేపీ చీకటి ఒప్పందం బట్టబయలు అయిందని ఆ పార్టీ విమర్శిస్తోంది. ఉపరాష్ట్రపతి ఎన్నికకు దూరం ఉండడం పరోక్షంగా బీజేపీకి మేలు చేయడం మాత్రమే అని చెడ్డీలు వేసుకొని రాజకీయాలను టీ–వీలో చూసే పిల్లవాడికి కూడా తెలుసు అంటూ ఆ పార్టీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ సందేశంలో పేర్కొన్నారు. ఇదే బీఆర్ఎస్– బీజేపీ అసలు స్వరూపమని కూడా సామా విమర్శించారు.

# నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక

- ఎన్‌డిఎ అభ్యర్థిగా రాధాకృష్ణన్... 'ఇండీ' అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డి
- ఉదయం 10 గంటలకు పోలింగ్ ప్రారంభం
- సాయంత్రం 5 వరకు పోలింగ్, 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- తదనంతరం ఫలితాల ప్రకటన





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 :** జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవికి మంగళవారం ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో ఉపఎన్నికకు సర్వం సిద్ధమైంది. పార్లమెంటు ఉభయ సభల సభ్యులు ఈ ఎన్నికలో ఓటు వేస్తారు. ఈ ఎన్నికలను తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ బహిష్కరించింది. అలాగే ఒడిషాకు చెందిన బిజూ జనతా దళ్ కూడా ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించింది. పాలక ఎన్‌డిఎ తరఫున మహారాష్ట్ర గవర్నర్ సీ.పీ. రాధాకృష్ణన్ (67), విపక్ష 'ఇండీ' కూటమి తరఫున సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి (79) పోటీ చేస్తున్నారు. అన్ని పార్టీల ఎంపీలు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. ఈ ఎన్నికకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీ.సీ. మోదీ రిటర్నింగ్ అధికారిగా ఉన్నారు. పార్లమెంటు భవనంలోని వసుధలో ఎఫ్–101 గదిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సాయంత్రం 6 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభమై వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ఆయా పార్టీల మద్దతు కోరిన సుదర్శన్ రెడ్డి కూడా దేశ రాజధానికి వచ్చారు. తాను ఎటువంటి పార్టీ తరఫున పోటీ చేయడం లేదని, రాజకీయాలకు అతీతంగా తనకు ఓటు వేయాలని ఉభయ సభల ఎంపీలకు లేఖ రాశారు. తమ ఎంపీలు ఓట్లు సక్రమంగా వేయేందుకు రెండు కూటములూ ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి. బీజేపీ ఎంపీలకు ఆ పార్టీ అధినాయకత్వం తలపెట్టిన రెండు రోజుల వర్క్‌షాప్ ఆదివారం ఢిల్లీలో ప్రారంభమైంది. ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సోమవారం ఎన్‌డిఎ ఎంపీలతో వ్యూహరచనలో పాల్గొన్నారు. విపక్ష ఎంపీలకు కాంగ్రెస్ సోమవారం మధ్యాహ్నం "సంవిధాన్ సదన్" సెంట్రల్ హాలులో మాక్ పోలింగ్ నిర్వహించి ఓటు ఎలా వేయాలో వివరించింది. ఉభయ సభలలో ఎన్‌డిఎకే సంఖ్యా బలం ఉంది. మొత్తం 788 మంది సభ్యుల కంటే ప్రస్తుతం 781 మంది ఉన్నారు. లోక్‌సభలో 542, రాజ్యసభలో 239 మంది సభ్యులు ఉన్నారు. ఎన్‌డిఎకు 425 మంది, 'ఇండీ' కూటమికి 311 మంది, ఇతర ప్రతిపక్షాలకు 45 మంది సభ్యులున్నారు. వైసీపీ (11 మంది) ఎన్‌డిఎ అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. బీజేడీ (7 మంది) మద్దతు కోసం ఆ పార్టీ అధినేత, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌కు ప్రధాని మోదీ స్వయంగా ఫోన్ చేశారు. బీఆర్ఎస్ ఎంపీ కె. సురేష్ రెడ్డి మాట్లాడుతూ, సరైన సమయంలో తమ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అయితే, చివరకు ఈ రెండు పార్టీలు ఎన్నికకు దూరంగా ఉండాలని నిర్ణయించాయి. బీఆర్ఎస్ పార్టీకి రాజ్యసభలో నాలుగు మంది సభ్యులు ఉన్నారు. శిరోమణి అకాలీదళ్ వంటి ఏకసభ్య పార్టీలు, స్వతంత్రులు ఎటు మొగ్గుతారో చూడాలి. రహస్య బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరగనుండటంతో, అధికార కూటమి నుంచి సుదర్శన్ రెడ్డికి క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశముందని కాంగ్రెస్ ఆశిస్తోంది. అటు బీజేపీ కూడా తమిళనాడు ఎంపీల్లో కొందరు తమ రాష్ట్రానికి చెందిన రాధాకృష్ణన్ వైపు మొగ్గుచూపుతారని అంచనా వేస్తోంది. దళిత, ఆదివాసీ ఎంపీలు జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని తమిళనాడుకు చెందిన వీసీకే ఎంపీ తిరుమావళవన్ ఒక లేఖలో పిలుపు ఇచ్చారు. ఆయన పార్టీకి లోక్‌సభలో ఇద్దరు సభ్యులు ఉన్నారు.

### చరిత్రలో గణాంకాలు

2002లో బీజేపీ అభ్యర్థి భైరోన్ సింగ్ షెకావత్‌కు 454 ఓట్లు వచ్చాయి. ఆయనపై కాంగ్రెస్ అభ్యర్థి సుశీల్ కుమార్ షిండేకు 302 ఓట్లు వచ్చాయి. వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నికైనప్పుడు 516 ఓట్లు సాధించగా, ప్రత్యర్థి గోపాలకృష్ణ గాంధీకి కేవలం 244 ఓట్లు వచ్చాయి. 2022లో జగదీప్ ధన్‌ఖడ్‌కు 520 ఓట్లు వచ్చినా, మార్గరెట్ ఆల్వాకు కేవలం 182 ఓట్లు మాత్రమే వచ్చాయి.

### ఈసారి అంచనాలు:

ఈసారి ఎన్‌డిఎ అభ్యర్థికి 500 ఓట్లలోపే వచ్చే అవకాశం ఉంది. విపక్షాలు తమకు ఉన్న 324 ఓట్లు సాధించినప్పటికీ, అధిక ఓట్లు పొందినవారే ఓడిపోవడం ఇదే తొలిసారి అవుతుంది. చెల్లని ఓట్లపై రెండు కూటముల్లో ఆందోళన నెలకొంది. 2022లో 15 మంది ఎంపీల ఓట్లు చెల్లకపోవడమే ఇందుకు కారణం. ఎంపీలు ఓటు వేయడంలో అక్షరాల ద్వారా కాకుండా అంకెల ద్వారా తమ ప్రాధాన్యాన్ని చూపాలని, ఎన్నికల కమిషన్ సూచించింది. కొంతమంది ఎంపీలు దీన్ని సరిగా అర్థం చేసుకోకపోవడం వల్లే గతంలో ఓట్లు చెల్లకపోయాయి. అంతేకాకుండా, ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిర్దిష్ట పెన్నుతో మాత్రమే ఓటు వేయాలి. ఇతర పెన్నులతో వాడితే ఓటు చెల్లదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రతి 15 మంది ఎంపీలకు ఒక సమన్వయకర్తను నియమించింది. ప్రతిపక్ష సభ్యులను సమన్వయపరచేందుకు ప్రత్యేక బృందాలను మోహరించింది.




# గ్రూప్-1పై నేడు హైకోర్టు తీర్పు

**హైదరాబాద్:** గ్రూప్–1 మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని, పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ కొందరు.. ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తయి ఉత్తర్వుల దశలో ఉన్న పరీక్షలను రద్దు చేయరాదంటూ ఎంపికైన అభ్యర్థులు మరికొందరు వేర్వేరుగా దాఖలు చేసిన పలు పిటిషన్లపై హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించనుంది. సంబంధిత పిటిషన్లపై జులై 7న వాదనలు విన్న జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు తీర్పు ఇవ్వనున్నారు. ఇప్పటికే గ్రూప్–1 పరీక్షల ఎంపిక ప్రక్రియ పూర్తయినప్పటికీ హైకోర్టులో కేసు విచారణ దృష్ట్యా కమిషన్ నియామక ఉత్తర్వులు జారీ చేయలేదు.

# కామారెడ్డి గడ్డ మీద మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు

### తెలంగాణ భాజపా చీఫ్ రామచందర్‌రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** బీసీ రిజర్వేషన్లకు భాజపా వ్యతిరేకమని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ భాజపా చీఫ్ రామచందర్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరుతో ద్రోహం చేసిందని ఆరోపించారు. తెలంగాణ బీసీలను కాంగ్రెస్ మోసం చేస్తుందని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పించకుండా కామారెడ్డి గడ్డ మీద మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదన్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల రాష్ట్రానికి రావాల్సిన రూ.3వేల కోట్లు ఆగిపోయాయని చెప్పారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు రాజ్‌నాథ్ సింగ్ వస్తున్నారని, అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.




# ఓటేయలేమని చెప్పడం విడ్డూరం

### ఉపరాష్ట్రపతి ఎన్నికకు బిఆర్ఎస్ దూరంపై ఎంపి చామల

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 :** ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఓటు వేయలేమని భారత రాష్ట్ర సమితి చెప్పడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే లోక్‌సభలో భారత రాష్ట్ర సమితికి సున్నా సీట్లు వచ్చాయని గుర్తు చేసిన ఆయన.. యూరియా ఇవ్వలేదు కాబట్టి ఎన్నికలకు దూరంగా ఉన్నాం, కాంగ్రెస్ పార్టీ భారత రాష్ట్రసమితిని ఇబ్బంది పెడుతోంది కాబట్టి ఎన్నికల్లో పాల్గొనడం లేదని ఉత్తుత్తి కబుర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రెండు విధాలుగా వారు ఎన్నికల్లో పాల్గొనకుండా ఉన్న విధానాన్ని తెలంగాణ ప్రజలు గమనించాలన్నారు. తెరాసగా ఆవిర్భవించి తెలంగాణ సెంటిమెంట్‌కు దూరంగా భారత రాష్ట్రసమితిగా పేరు మార్చినప్పుడే.. తెలంగాణ అంశాన్ని ఆ పార్టీ మర్చిపోయిందని విమర్శిం చారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విపక్షాల అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఏ పార్టీకీ చెందిన వారు కాదని, ప్రజాస్వామ్యం గురించి మంచి అవగాహన ఉన్న వ్యక్తికి ఓటు వేయకపోవడం, ఎన్నికలకు దూరంగా ఉండ టం చూస్తే లోక్‌సభ, రాజ్యసభలో కూడా భారత రాష్ట్ర సమితి అవసరం లేని పార్టీగా మారిపోయిందని ఎద్దేవా చేశారు.

# జస్టిస్ సుదర్శన్ రెడ్డికే ఓవైసీ మద్దతు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 :** ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి, జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మజ్లిస్ తన మద్దతు ప్రకటించింది. సీఎం రేవంత్‌రెడ్డి మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీకి ఫోన్ చేసి జాతీయ ప్రయోజనాల దృష్ట్యా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరిన నేపథ్యంలో.. ఆ మేరకు పార్టీ నిర్ణయం తీసుకుందని తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వడమే సమంజసమని భావిస్తున్నట్లు ఒవైసీ పేర్కొన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఆయనకే తమ ఓటు అని ఓవైసీ ప్రకటించారు. మజ్లిస్ పక్షాన పార్లమెంటులో ఓవైసీకి ఒక్కరికే ఓటుంది.

# గురుకుల పాఠశాల విద్యార్థినులను కొరికిన ఎలుకలు

**గోపాలపేట, సెప్టెంబర్ 8 :** వనపర్తి జిల్లా గోపాలపేట మండల పరిధిలోని బుద్దారంగండిలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏడుగురు విద్యార్థినులను ఎలుకలు కొరికాయి. వివరాల్లోకి వెళితే పదో తరగతి చదువుతున్న ఏడుగురు విద్యార్థినులు ఒకే గదిలో ఉంటున్నారు. ఆదివారం రాత్రి వారి కాళ్లు, చేతులను ఏదో కరిచినట్లు గుర్తించారు. నిద్ర నుంచి లేచి చుట్టుపక్కలా పరిశీలించగా ఎలుకలు కనిపించాయి. వాటిని గుర్తించిన విద్యార్థినులు ప్రిన్సిపల్ ఆరోగ్యానికి తెలిపారు. ప్రిన్సిపల్ ఆ విషయాన్ని పాఠశాలలో ఉన్న ఏఎన్ఎమ్ మౌనిక దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల సూచనల మేరకు ఆమె విద్యార్థులతో మాట్లాడి.. గోపాలపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. వైద్యుడు చాంద్‌బాషా వారికి వైద్యపరీక్షలు చేశారు. ప్రాణాపాయం ఏమీ లేదని చెప్పారు.



# చర్లపల్లి డ్రగ్స్ కేసు..

### డ్రగ్స్ కోసం ముంబయి నుంచి హైదరాబాద్ వచ్చిన నిందితులు

**హైదరాబాద్:** చర్లపల్లి డ్రగ్స్ కేసులో దర్యాప్తును మహారాష్ట్ర పోలీసులు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఈ కేసులో 12 మందిని అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో తయారు చేస్తోన్న మెఫిడ్రిన్ డ్రగ్స్‌ను నిందితులు మహారాష్ట్రకు తరలించినట్లు గుర్తించారు. డ్రగ్స్ కోసం ముంబయి నుంచి ఫైజల్, ముస్తఫా హైదరాబాద్‌కు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ముస్తఫాపై మహారాష్ట్రలో పలు కేసులు నమోదయ్యాయని, హైదరాబాద్ నుంచి మెఫిడ్రిన్ డ్రగ్స్ విక్రయించడానికి ఫైజల్ మధ్యవర్తిగా వ్యవహరించినట్లు చెప్పారు. అరెస్టు అయిన నిందితులను కస్టడీకి తీసుకుంటే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు చర్లపల్లి వాగ్దేవి ల్యాబొరేటరీ వద్ద పీసీబీ, ఎక్సైజ్, నార్కోటిక్ బ్యూరో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో వివరాలు సేకరించిన తర్వాత చర్యలు తీసుకుంటామని అధికారుల తెలిపారు.


# మున్నేరుకు రెండువైపులా ఏకకాలంలో కరకట్టలు నిర్మించండి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** మున్నేరు ముంపు బాధితులకు ఇబ్బంది లేకుండా కరకట్టలు నిర్మించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీల సమన్వయంతో కరకట్ట లు నిర్మించాలన్నారు. నీటిపారుదల, ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఖమ్మం మున్నేరు కరకట్టల నిర్మాణం, కేబుల్ వంతెన నిర్మాణాలపై ఆరా తీశారు. ఏప్రిల్ చివరి నాటికి కేబుల్ వంతెన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రూ.180 కోట్ల వ్యయంతో కేబుల్ వంతెన నిర్మాణం, రూ.690 కోట్లతో మున్నేరు కరకట్టల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మున్నేరుకు రెండువైపులా ఏకకాలంలో కరకట్టలు నిర్మించాలన్నారు.

# లక్ష్యం చేరని సంపూర్ణ అక్షరాస్యత



ఏ దేశమైనా అక్షరాస్యతను కలిగివుంటేనే అభివృద్ధి చెందుతుంది. దేశంలో నిరక్ష్యరాస్యతను తొలగించిన నాడే పురోగమిస్తుంది. ప్రతి ఏటా సెప్టెంబర్ 8వ తేదీని 'అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం'గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అయితే సంపూర్ణ అక్షరాస్యత విషయంలో కేంద్ర,రాష్ట్రాలు ఇంకా పూర్తిస్థాయిలో కృషి చేయడం లేదు. గ్రామాల వారీగా అక్షరాస్యతకు కృషి చేయడం లేదు. నవంబర్ 17, 1965 సంవత్సరంలో యునెస్కో సభ్యదేశాల విద్యాశాఖ మంత్రుల మహాసభ అనంతరం అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రకటించగా 1966 నుండి జరుపుకుంటున్నాం. అక్షరాస్యత అంటే సాంప్రదాయకంగా భాషను ఉపయోగించేందుకు అవసరమైన చదవటం, రాయటం, వినటం, మాట్లాడటం అనే నాలుగు ప్రాథమికాంశాలు తెలుసుకోవటాన్నే అక్షరాస్యత అనవచ్చు. అయితే మనిషి దైనందిన జీవితంలో ఈ రాయడం, చదవటం మాత్రమే అక్షరాస్యత అనేది కాదనీ, అక్షరాస్యత అంటే మనిషి గౌరవం, అవకాశాలు, అభివృద్ధి గురించి చెప్పడమే నిజమైన అక్షరాస్యత అని కొంతమంది పెద్దలు చెబుతుంటారు. ఉన్నతమైన జీవనానికి ప్రపంచం అన్నిరంగాల్లో ముందుకు సాగేందుకు విద్య, విజ్ఞానం ఎంతో అవసరం. అయితే ప్రపంచంలో కొన్ని దేశాలు వెనుకబడి ఉండడానికి నిరక్షరాస్యత ముఖ్యకారణం. అలా వెనకబడిన దేశాలను ముందుకు తీసుకురావడానికే అక్షరాస్యతను శాతాన్ని పెంచాలి. ఇది పిల్లల్లోనే కాకుండా వయోజన విద్య మీద కూడా కేంద్రీకరించబడింది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోలిస్తే అక్షరాస్యత విషయంలో భారతదేశం అగాధంలో వున్నట్లే చెప్పవచ్చు. ఈ మాత్రమైనా మనదేశ అక్షరాస్యత ఉందంటే దానిక్కారణం కొన్ని రాష్ట్రాలు అక్షరాస్యతను సాధించటంలో ముందుం డటం తప్ప మరోటి కాదు. అనేక రాష్ట్రాలు సగటు అక్షరాస్యతా శాతానికి దూరంగా ఉన్న విషయం తెలిసిందే. మొత్తం మీద ప్రపంచ నిరక్షరాస్యుల్లో సగం మంది మనదేశంలోనే ఉండటం విచారకరం. గతంలో వయోజన విద్యకు ప్రాధాన్య ఇచ్చేవారు. ఈ మధ్య అది కనిపించడం లేదు. ప్రతి ఒక్కరిని అక్షరాస్యులను చేయాలన్న సంకల్పం యేరకు గ్రామస్థాయిలో సర్వేచేసి పిల్లలను బలవంతంగా స్కూళ్లకు చేర్చారు.

అలాగే పనిప్రదేశాల్లో బాలకార్మికులను లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. ఏకోపాధ్యాయ పాఠశాలలన పెంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా, కేవలం అక్షరజ్ఞానం కలిగించేలా చూడాలి. ఏటా ఉత్సవాలు జరపడంతో పాటు చేస్తున్న కృషికి అనుగుణంగా అక్షరాస్యత పెరిగిందా లేదా అన్నది బేరీజు వేసుకోవాలి.స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే దేశంలో 80 శాతం అక్షరాస్యత సాధిం చాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన 79ఏళ్లు గడుస్తున్నా సంపూర్ణ అక్షరాస్యతను సాధించలేదు. అందరూ చదివినప్పుడే గ్రామాభివృద్ధి జరుగుతుంది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోలిస్తే అక్షరాస్యత విషయంలో భారతదేశం అగాధంలో వున్నట్లే చెప్పవచ్చు.ఈ మాత్రమైనా మనదేశ అక్షరాస్యత ఉందంటే దానిక్కారణం కొన్ని రాష్ట్రాలు అక్షరాస్యతను సాధించటంలో ముందుండటం తప్ప మరోటి కాదు. ప్రపంచ నిరక్షరాస్యు ల్లో సగం మంది మనదేశంలోనే ఉండటం విచారకరం. స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే దేశంలో 80 శాతం అక్షరాస్యత సాధించాల్సిన అవసరం ఉంది. ప్రధానగా విద్యారంగం పట్ల కేంద్ర, రాష్ట్రాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ కేటాయింపును తగ్గించే స్తున్నాయి. జనాభాకు అనుగుణంగా విద్యారంగ అభివృద్ధి జరగడం లేదు. విద్యారంగంలో విప్లవం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా..మార్పులు మాత్రం కానరావడం లేదు. ఎందుకనో పాలకులు ఎవరు అధికారంలో ఉన్నా ఈ రంగంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫీజుల దోపిడీపై గళమెత్తు తున్నా పట్టించుకోవడం లేదు.

కార్పోరేట్ స్కూళ్ల పేరుతో చేస్తున్న దోపిడీ అంతాఇంతా కాదు. తెలంగాణలో కెజి టూ పిజి విద్యకు ప్రణాళిక పట్టాలకెక్కడం లేదు. ఎపిలో జగనన్న విద్యా కానుక తప్ప స్కూళ్ల బలోపేతం జరగలేదు. ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో చదివిన వారు మత్రమే టాపర్స్‌గా నిలుస్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందో గమనించాలి. దీనివెనక ఏదైనా గూడుపుఠాణి ఉందా అన్నది బయటపెట్టాలి. ప్రభుత్వ రంగంలో ప్రాథమిక విద్యకు బలమైన పునాదులు పడాలి. అలాగేకార్పోరేట్ దోపిడీని అరికటటాలి. అప్పుడే విద్యారంగం విస్తృతం కాగలదు. సామాన్యుడి నుంచి, రాజకీయనాయకుల, అధికారుల పిల్లలంతా ఒకే విద్యావిధానంలో చదవాలన్న ఆకాంక్ష అమలు కావడం లేదు. విద్యాభివృద్దిలో కులరహిత హాస్టళ్లు ఉండకూడదు. కామన్ ఎడ్యుకేషన్ అన్నది సమాజాంలో అంతరాలను తొలగిస్తుంది. అది ఎల్‌కెజి నుంచే పిల్లల్లో భేదభావాలు లేకుండా చేస్తుంది. ఇప్పుడున్న స్కూళ్లను చూస్తుంటే ఆర్థికస్థాయిని బట్టి నడుపుతున్నారు. అయితే ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉండగానే గురుకులాలు, ఉర్దూమీడియం స్కూళ్లు ప్రారంభించడం, అనేక హాస్టళ్లను కొత్తగా చేపట్టడం వల్ల సమగ్ర విద్యాపథకం అటకెక్కిందనే భావించాలి. సమగ్రమైన విద్యతో పాటు, విద్యార్థి అన్ని రంగాల్లో రాటుదేలేలా విద్యా సంస్కరణలు రావాలి. ప్రతి ఒక్కరూ చదవడం,రాయడం లక్ష్యంగా ముందుకు సాగాలి. కనీసం పేపర్ చదవగలిగేలా చేయాలి. ఇంటర్‌నెట్ విస్తృతి పెరిగినా ప్రభుత్వ ప్రోత్సాహం దక్కడం లేదు. అయితే గతంతో పోలిస్తే విద్యారంగం లో అనేక విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. గురుకులాల ఏర్పాటు వల్ల సామాన్యులకు నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులోకి వచ్చింది. దానిని కాదనలేం. అన్ని రంగాల్లో విద్యార్థులు విజయాలు సాధించేలా మన విద్యారంగాన్ని తీర్చిదిద్దుకోవాలి. విద్యారంగానికి ప్రభుత్వం కూడా అధిక బడ్జెట్ కేటాయింపులు చేసి వివిధ రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలి. గురుకుల విద్యాలయాలు పెరిగాయి. ఒక్కొక్క విద్యార్థిపై ఏటా ఒక లక్ష రూపాయలు వెచ్చిస్తున్నారు. పేదపిల్లలకు కార్పోరేట్ విద్యాసంస్థలను తలదన్నే విధంగా చదువు, సౌలభ్యాలు, మౌలిక వసతులు లభిస్తున్నాయి. చదువుకుంటే నిరుద్యోగిగా మిగిలిపోతున్న ప్రస్తుత తరుణంలో ఉపాధికి తగ్గ చదువు దక్కేలా చేయాలి.చిత్తశుద్ధి ఉంటే తప్ప విద్యారంగాన్ని మార్చలేం. అందరికీ విద్య అన్నది ప్రాథమిక హక్కుగా ఉన్నా, ఆచరణలో సాధ్యం కావడంలేదు. దీనిని ఆచరణలోకి తీసుకుని వచ్చేలా చర్యలు తీసుకుంటే తప్ప సంపూర్ణ అక్షరాస్యత సాధ్యం కాదు.

# వాహన కొనుగోలుదారులకు దసరా బోనాంజా

- జీఎస్టీ తగ్గించడంతో ఆగిపోయిన క్రయవిక్రయాలు
- దసరా నాటికి కొత్త వాహనాల కోసం ఎదురుచూపు




**ముంబై, ఆగస్టు 8 :** అధిక ధరలతో ఆందోళన చెందుతున్న సామాన్యులకు కేంద్రం సవరించిన జీఎస్టీ భారం ఊరట కలిగించనుంది. కొత్తగా జీఎస్టీ మూడు స్లాబులుగా విభజించారు. పాత విధానంలో ఉన్న 12 శాతం, 28 శాతం స్లాబులను పూర్తిగా తొలగిస్తూ, 5 శాతం, 18 శాతం జీఎస్టీతో పాటు విలాసవంతమైన వాటిపై 10 శాతం అదనంగా జీఎస్టీ విధిస్తూ కేంద్రం కొత్త సంస్కరణలను ప్రవేశపెట్టింది. దీంతో వాహన రంగంలో భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. ముఖ్యంగా అనేక రకాల వాహనాల ధరలు గణనీయంగా తగ్గనున్నట్లు ఆటో మొబైల్ రంగ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నిత్యావసర వస్తువులపై పన్నుల భారాన్ని కూడా కేంద్రం గణనీయంగా తగ్గించింది. హెయిర్ ఆయిల్, షాంపులు, నెయ్యి, చీజ్, నామ్కిన్లు, వంట పాత్రలపై ఉన్న 12 శాతం, 18 శాతం జీఎస్టీని 5 శాతం స్లాబులోకి చేర్చారు. అలాగే ఆరోగ్య జీవిత బీమాలపై గతంలో ఉన్న 18 శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించి జీరో జీఎస్టీగా మార్చడం కూడా ప్రజలకు ఊరట కలిగించనుంది. దియాగ్నస్టిక్ కిట్లు, గ్లూకోమీటర్లు, కళ్లద్దాలు కూడా జీరో జీఎస్టీ పరిధిలోకి రావడం మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించనుందని నిపుణులు పేర్కొంటున్నారు. విద్యకు సంబంధించిన మ్యాపులు, పుస్తకాలు, క్రేయాన్లు, ఎరేజర్లు తదితర విద్యాసామాగ్రిపై ఉన్న 5 శాతం, 12 శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించి జీరో జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడం పేద విద్యార్థులకు ఉపశమనం కలిగించనుంది. ఇవే కాకుండా అనేక ఎలక్ట్రికల్ ఉత్పత్తులు, ఇతర నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గింపులు అమలులోకి రానున్న నేపథ్యంలో, సెప్టెంబర్ 22వ తేదీ కోసం కొనుగోలుదారులు ఎదురుచూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్త జీఎస్టీ టారిఫ్‌లను ప్రకటించడంతో వాహనరంగ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడనుంది.

## కొత్త వాహనాల కోసం ఎదురుచూపు

ఈ నెల 22వ తేదీ నుంచి అనేక వస్తువులు, వాహనాలపై జీఎస్టీ భారం గణనీయంగా తగ్గనుండటంతో ప్రజలు కొనుగోళ్లను మరో రెండు వారాలు వాయిదా వేస్తున్నారు. రానున్నది దసరా సీజన్ కావడంతో వాహనాలు కొనుగోలు చేయడం ఒక సంప్రదాయంగా మారింది. అయితే, దసరాకు కొనుగోలు చేయాలనుకునేవారు ఇప్పుడు బుకింగ్స్‌ను వాయిదా వేసుకుంటున్నారు. 22వ తేదీ తర్వాతే వారు కొనుగోళ్లకు ప్రణాళికలు రచిస్తున్నారు. సెకండ్‌హ్యాండ్ వాహనాల కొనుగోలుపై కూడా ప్రభావం కనపడనుంది. వ్యవసాయరంగానికి సంబంధించిన ట్రాక్టర్లు, పురుగుమందులు, నీటిపారుదల శాఖకు చెందిన మోటార్లు, విద్యకు సంబంధించిన పుస్తకాలు తదితర వాటిపై కూడా జీఎస్టీ తగ్గింపు ప్రభావం ఉండనుంది. ఈ క్రమంలో 22వ తేదీ వరకు కొనుగోళ్లలో నెమ్మదింపు వచ్చే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దసరాకు పదిరోజుల ముందు, సెప్టెంబర్ 22వ తేదీ నుంచే కొత్త జీఎస్టీ అమల్లోకి వస్తుందని కేంద్రం ప్రకటించింది.

## వాహన మార్కెట్‌పై తీవ్ర ప్రభావం

జీఎస్టీ తగ్గింపుతో వాహన మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడనుందని విశ్లేషకులు చెబుతున్నారు. సెప్టెంబర్ 3న ప్రకటించిన కొత్త జీఎస్టీ శ్లాబుల ప్రకారం, వాహనాలపై జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించబడింది. ఇది అంటే 10 శాతం తగ్గుదల, వాహనాల ధరల్లో గణనీయమైన తగ్గింపుకు దారితీయనుంది. కొనుగోలుదారులు ఈ తగ్గింపుల కోసం మరో రెండు వారాలు నిరీక్షించేందుకు సిద్ధమయ్యారు. మధ్యతరగతి ప్రజలు అధికంగా వినియోగించే 350 సీసీల లోపు బైకులపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. ఈ 10 శాతం తగ్గుదలతో బైకుల ధరల్లో స్పష్టమైన మార్పు కనిపించనుంది. అలాగే 100 సీసీలపైన సామర్థ్యం ఉన్న బైకుల ధరలు ఇప్పటికే రూ.1 లక్షకు పైగా ఉన్నాయి. ఇటీవల ఎక్కువ క్రేజ్ ఉన్న ఎలక్ట్రిక్ బైకుల ధర రూ.30 వేల నుంచి రూ.1 లక్షకు పైగా ఉన్నాయి. వీటిపై కూడా 10 శాతం జీఎస్టీ తగ్గింపు అమలులోకి రానుంది. ఈ లెక్కన ద్విచక్ర వాహనాలపై కనిష్టంగా రూ.6,000 నుంచి గరిష్టంగా సుమారు రూ.12.5 కోట్లు వరకు ధరలు తగ్గే అవకాశం ఉంది. ఫలితంగా ప్రతినెల బైకులపై గరిష్టంగా రూ.12.5 కోట్ల వరకు వినియోగదారులు పన్ను తగ్గింపుతో లాభపడనున్నారు. కార్లపై కూడా 28 శాతం జీఎస్టీని 18 శాతానికి తగ్గించారు. దీని వల్ల కార్లపై కనిష్టంగా రూ.90 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ధరలు తగ్గే అవకాశం ఉంది. ఈ లెక్కన కార్లపై నెలకు రూ.6 కోట్లు నుంచి రూ.15 కోట్ల వరకు జీఎస్టీ తగ్గింపుతో లాభం చేకూరే అవకాశముందని అంచనా. మొత్తంగా, జీఎస్టీ తగ్గింపుతో ప్రతిఏటా బైకులు, కార్ల కొనుగోళ్లపై సుమారు రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకు వినియోగదారులపై ఉన్న భారం తగ్గనుంది.

## షోరూముల్లో బుకింగ్‌లు భారీగా తగ్గిపోయాయి

కేంద్రం తాజా ప్రకటనతో ప్రస్తుతం షోరూముల్లో బుకింగ్‌లు భారీగా తగ్గిపోయాయని నిర్వాహకులు చెబుతున్నారు. వాహనాలు కొనుగోలు చేయాలనుకునేవారు మరో రెండు వారాలు ఆగితే తగ్గింపు ధరలు లభిస్తాయన్న ఆశతో ఉన్నారు. వాహనాల కొనుగోలుదారులను ఆకర్షించేందుకు షోరూమ్ నిర్వాహకులు కొత్త ఆఫర్లను ప్రకటిస్తున్నారు. ముందస్తుగా బుకింగ్ చేసుకుని 22వ తేదీ తర్వాతే డెలివరీ చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. కొన్ని కంపెనీలు 22వ తేదీ నాటికి వర్తించే జీఎస్టీ రేట్లనే వర్తింపజేస్తామని సంకేతాలు ఇస్తున్నాయి. ఇక సెకండ్‌హ్యాండ్ వాహనాలపై కూడా జీఎస్టీ తగ్గింపు ప్రభావం పడనుంది. వ్యవసాయ సంబంధిత యంత్రాలపై కూడా భారీగా తగ్గింపులు రానున్నాయి. అలాగే పురుగుమందులపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించడం వల్ల రైతులకు గణనీయమైన లాభం చేకూరనుంది.

# క్రీడలను విస్మరించిన కార్పోరేట్ స్కూళ్లు

## ఇరుకు గదుల్లో బోధనతో మానసిక ఒత్తిడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :** పట్టణాల్లో కార్పోరేట్ స్కూల్ కల్చర్ వచ్చాక క్రీడలను పూర్తిగా విస్మరించారు. క్రీడలకు అవకాశం లేకుండా చదువులు కొనసాగుతున్నాయి. పైరవీలుచేసి అనుమతులు తెచ్చుకుంటున్న కార్పోరేట్ విద్యాసంస్థలు అపార్ట్‌మెంట్ లాంటి గదుల్లో చదువులు కొనసాగిస్తూ, క్రీడలను విస్మరించాయి. కేవలం ఇరుకుగదుల్లో పిల్లలను బందీలను చేశారు. పుస్తకాలను బట్టీ పట్టించడం తప్ప మరోటి వారికి తెలియకుండా చేస్తున్నారు. క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థులు ఏక కాలంలో చదువులపై, ఆటలపై దృష్టి సారించలేరు. అటువంటి విద్యార్థులకు ఉన్నత చదువులలో రిజర్వేషన్ సౌకర్యం ఉండాలి. ఉద్యోగాలలో రిజర్వేషన్ల వల్ల క్రీడాకారులకు భవిష్యత్ ఉపాధికి హామీ ఉంటే క్రీడల్లో తమ పిల్లల్ని ప్రోత్స హించే తల్లిదండ్రుల సంఖ్య క్రమంగా పెరగడానికి అవకాశాలు ఉంటాయి. క్రీడలకు సరైన ప్రోత్సహకాలు లేక ఎంతోమంది భావిక్రీడాకారులు మట్టిలో మాణిక్యాల వలే మిగిలిపోయారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు కూడా దినసరి కూలీలాగా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ కాలం వెళ్ళదీస్తున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. అలాగే క్రీడాకారులకు ఉద్యోగాల్లో 2శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం గ్రామిణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకు అనుగుణంగా పాఠ్యాంశాలను, కరికులమ్‌ను మార్చాలి. పాఠశాల స్థాయి నుంచి నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి భవిష్యత్తులో సామాజిక మార్పునకు దోహద పడుతుందని రుజువు చేయాలి. అలాగే తమ ప్రతిభ ద్వారా దేశానికి, రాష్ట్రాలకి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టే క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల బాధ్యత. ర్యాంక్‌లు, మార్కులకోసం పోటీపడే ప్రస్తుత కాలంలో ఆటలు ఆడితే పిల్లలు పాడవుతారని, చదువుల్లో వెనకబడతారనే తల్లిదండ్రులు ఆలోచిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు క్రీడా సాంస్కృతిక కళల పట్ల ఆసక్తి చూపించడం లేదు. దానికి కారణాలు కూడా లేకపోలేదు. గ్రామస్థాయిలో సరైన సదుపాయాలు లేకపోవడం, క్రీడలను ప్రోల్సహించేలా పరికాలు, క్రీడా సామాగ్రి లేకపోవడం, ఆడుకోవడానికి మైదానాలు లేకపోవడం వంటి కారణాలూ ఉన్నాయి. విద్యా సంస్థలు సైతం వీటిని ప్రోత్సహించడం లేదు. అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు, ఎయిడెడ్ సంస్థల్లో క్రీడాంశాలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు రిజర్వేషన్ సౌకర్యం వర్తించే విధంగా చూడాలి. నిజమైన క్రీడాకారులకు రిజర్వేషన్ల ఫలాలు దక్కేలా అన్ని శాఖలు సమిష్టి కృషి చెయ్యాలి. ఈ ఫలితాలు పొందిన క్రీడాకారులు భావి క్రీడాకారులను ప్రోత్సహించాలి. అలాగే ఫీజుల దోపిడీని అరికట్టేలా కఠినచర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రైవేట్ పెత్తనం పోగలదు.

# తెలుగు రాష్ట్రాల్లో తెరుచుకున్న ఆలయాలు



**తిరుమల, సెప్టెంబర్ 8 :** చంద్రగ్రహణం తర్వాత తెలుగు రాష్ట్రాల్లో వివిధ ఆలయాలు తెరుచుకున్నాయి. తిరుమలలో ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం తర్వాత వేకువజామున 2.40 గంటలకు శ్రీవారి ఆలయ తలుపులు తెరిచారు. సుప్రభాత సేవను అర్చకులు ఏకాంతంగా నిర్వహించారు. తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు సర్వ దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. 18 కంపార్టెమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు.

- శ్రీశైలం మల్లన్న ఆలయంలో చంద్రగ్రహణం సంప్రోక్షణ పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు మల్లన్న ఆలయ ద్వారాలను అధికారులు తెరిచారు. ఆలయ శుద్ధి తర్వాత అర్చకులు ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. ఉదయం 7.30 గంటల నుంచి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనాలు ప్రారంభమయ్యాయి.
- సింహాచల దేవస్థానం శ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామికి చంద్రగ్రహణం అనంతరం సంప్రోక్షణ పూర్తి చేశారు. ఉదయం 8 గంటల నుంచి భక్తుల దర్శనాలకు అనుమతి ఇచ్చారు. విశాఖ బురుజు పేట శ్రీకనక మహాలక్ష్మి ఆలయంలో సంప్రోక్షణ పూర్తి చేసి ఉదయం 9 గంటల నుంచి దర్శనాలకు అనుమతి ఇచ్చారు.
- బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంతో పాటు ఉప ఆలయాల్లో కవాటోద్ఘాటనం గణపతి పూజ నిర్వహించారు. వేకువజాము నుంచి మహా సంప్రోక్షణ, ఆలయ శుద్ధి కార్యక్రమం చేశారు. అనంతరం సుప్రభాతం, విశేష అభిషేకం, మహా నివేదన నీరాజనం, మహా మంత్రపుష్ప నిర్వహించారు. ఆలయంలో యథావిధిగా తిరిగి అక్షరాభ్యాసాలు, ఆర్జిత సేవలు ప్రారంభమయ్యాయి.
- యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని అధికారులు తెరిచారు. తెల్లవారుజామున 3.30 గంటలకు ఆలయాన్ని తెరిచి అర్చకులు సంప్రోక్షణ చేశారు. నిత్య కైంకర్యాలు నిర్వహించి యథావిధిగా స్వామివారి దర్శనానికి భక్తులకు అనుమతి ఇచ్చారు.
- విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉదయం 8.30 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతి ఇచ్చారు. సంప్రోక్షణ, పూజల తర్వాత అమ్మవారి దర్శనానికి వీలు కల్పించారు.
- చంద్రగ్రహణం ముగిసినందున భద్రాద్రి రామాలయం తలుపులు తెరుచుకున్నాయి. తెల్లవారుజామున 3 గంటలకు రామాలయం తలుపులు తెరుచుకున్నాయి. సుప్రభాత సేవ తర్వాత గోదావరి జలాలతో ఆలయాన్ని అర్చకులు శుద్ధి చేశారు. అనంతరం ప్రధానాలయంలో సీతారాము మూలమూర్తులకు అభిషేకం చేశారు. స్వామివారి మహానివేదన తర్వాత ఉదయం 7.30 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతి ఇచ్చారు.

# నేడు ఉపరాష్ట్రపతి ఎన్నిక

## బిజెపి ఎంపిలకు దిశానిర్దేశం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 :** ఉపరాష్ట్రపతి ఎన్నికలకు బిజెపి పక్కా ప్లాన్‌తో సిద్ధమయ్యింది. తమ అభ్యర్థిని గెలిపించుకునేందుకు ఓటేసే అభ్యర్థుల జాబితాతో కసరత్తు చేసింది. మంగళవారం ఎన్నక జరగబోతున్న తరుణంలో భాజపా నాయకత్వం ఆ పార్టీ ఎంపీలకోసం ఆదివారం పార్లమెంటు- ఆవరణలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీతోపాటు- భాజపాకు చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలంతా పాల్గొన్నారు. మోదీ సాధారణ ఎంపీ తరహాలో చివరి వరుసలో కూర్చొని సీనియర్ నేతలు చెప్పిన విషయాలను శ్రద్ధగా ఆలకించారు. జీఎస్టీ రేట్లు తగ్గించి సామాన్యులకు ఊరట కల్పించినందుకు ఎంపీలు ఆయన్ను అభినందిస్తూ తీర్మానం చేశారు. ఎంపీల ప్రశంసలను వినమ్రంగా స్వీకరిస్తూ.. తాను కూడా అందరిలానే సాధారణ కార్యకర్తనని ప్రధాని తెలిపారు. సామాజిక మాధ్యమాలను బలంగా ఉపయోగించుకోవడం, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంపై దృష్టి సారించాలని ఎంపీలకు సీనియర్ నేతలు సూచించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఎన్డీయే ఎంపీలను సిద్ధం చేసేందుకు మాక్ పోలింగ్ కూడా భాజపా నిర్వహించనుంది. పరాష్ట్రపతి ఎన్నిక మంగళవారం జరగనున్న నేపథ్యంలో ఈ ఎన్నికలో ఓటు వేయాల్సిన పద్ధతిని, పాటించాల్సిన విధి విధానాలను వివరించనున్నారు.



# ఇందల్వాయిలో కంటైనర్ దగ్ధం

## భారీగా ఎగసిపడ్డ మంటలు

**ఇందల్వాయి :** నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద కంటైనర్ లారీ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. డీజిల్ ట్యాంక్ నుంచి మంటలు రావడంతో ఈ ప్రమాదం సంభవించింది. మంటలు భారీగా ఎగసిపడ్డాయి. వాటిని ఆర్పేందుకు టోల్ ప్లాజా సిబ్బంది ప్రయత్నించారు. అనంతరం సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. కంటైనర్ హైదరాబాద్ నుంచి నాగపుర్‌కు పార్సిల్స్ తీసుకెళ్తున్నట్లు గుర్తించారు.

# గౌతమ్ అడ్వాన్స్డ్ ఫిజియోథెరపీ కేంద్రంలో ఉచిత వైద్యం

## ఎండి, ఫిజియోథెరపీ స్పెషలిస్ట్ డాక్టర్ ఇమ్మడి రమేష్



- ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా సుమారు 50 మందికి ఉచితంగా ఫిజియోథెరపీ వైద్యం చేసిన డాక్టర్ రమేష్, అసిస్టెంట్ రచన
- గత కొన్ని సంవత్సరాలుగా ఎంతోమందికి పలు రకాల చికిత్సలకు ఫిజియోథెరపీ అందిస్తున్న డాక్టర్ రమేష్
- అందరికీ అందుబాటులో ఉండే విధంగా అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన వైద్యం
- ఆర్థో, న్యూరో, కైరోటిక్, ఆస్టియోపతి, నీడిలింగ్ ఫిజియోథెరపీ లకు ప్రత్యేకం
- ఉప్పల్, మేడిపల్లి మండలాల ప్రజలందరికీ అందుబాటులో ఫిజియోథెరపీ వైద్యం



**పీర్జాదిగూడ రాజముద్ర న్యూస్:** ప్రజలకు మరింతగా సేవ చేయాలన్న భావనతో ఫిజియో థెరపీలో ఉన్నటువంటి అన్ని రకాల చికిత్సలను దేశ, విదేశాలలో అధ్యయనం చేసి బోడుప్పల్, మేడిపల్లి, పీర్జాదిగూడ, ఉప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలకు అతి తక్కువ ఫీజులతో ఆధునిక పద్ధతిలో చికిత్సను అందిస్తున్నామని గౌతమ్ అడ్వాన్సుడ్ ఫిజియో థెరపీ సెంటర్ ఎండి డాక్టర్ ఇమ్మడి రమేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సెప్టెంబర్ 8న జరుపుకునే ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా పీర్జాదిగూడ నగర పరిధిలోని బోడుప్పల్ రోడ్డులో హెచ్డిఎఫ్సి బ్యాంక్ ఎదురుగా నైరా హాస్పిటల్ రెండవ అంతస్తులో గత కొన్ని సంవత్సరాలుగా గౌతమ్ అడ్వాన్స్డ్ ఫిజియోథెరపీ సెంటర్ లో సుమారు 50 మందికి ఎలాంటి ఫీజులు తీసుకోకుండా ఉచితంగా చికిత్సలను అందించారు. గౌతమ్ అడ్వాన్స్డ్ ఫిజియోథెరపీ సెంటర్ లో విశేషమైన సేవా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎండి, ఫిజియోథెరపీ స్పెషలిస్ట్ డాక్టర్ ఇమ్మడి రమేష్ దాదాపు 50 మందికి ఉచితంగా ఫిజియోథెరపీ చికిత్సలు అందించారు. రోగులకు తగిన పరీక్షలు చేసి, వ్యక్తిగత అవసరాలకు తగ్గట్లు ఫిజియోథెరపీ సెషన్లు నిర్వహించడం ద్వారా వారికి మంచి ఉపశమనం కలిగించారు. గత కొన్ని సంవత్సరాలుగా డాక్టర్ ఇమ్మడి రమేష్ ఫిజియోథెరపీ రంగంలో దేశ, విదేశాలలో పలు రకాల ఫిజియోథెరపీ చికిత్సలపై అధ్యయనం చేసి, ప్రశంసా పత్రాలను పొందారు. బోడుప్పల్ లోని ఫిజియోథెరపీ సెంటర్ లో అనేక మందికి నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. ఆర్థో, న్యూరో, కైరోప్రాక్టిక్, ఆస్టియోపతి, నీడిలింగ్ థెరపీ వంటి ఆధునిక చికిత్సల్లో ఆయనకు ప్రత్యేక నైపుణ్యం ఉంది. తక్కువ ఫీజులతో అందరికీ అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించడం ఆయన ప్రత్యేకత. సాధారణ ప్రజలకు అధిక ఖర్చులు లేకుండా నిపుణుల వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో ఆయన ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ప్రత్యేకంగా ఉప్పల్, మేడిపల్లి, పీర్జాదిగూడ పరిసర ప్రాంతాల ప్రజలు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. ఆర్థ్రైటిస్, నడుము నొప్పులు, మెడ నొప్పులు, మోకాళ్ల సమస్యలు, న్యూరో సంబంధిత వ్యాధులు, స్పోర్ట్స్ ఇంజరీస్ వంటి అనేక సమస్యలకు సరైన ఫిజియోథెరపీ చికిత్సలు ఇక్కడ లభిస్తున్నాయి. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ – "ఫిజియోథెరపీ అనేది కేవలం నొప్పులు తగ్గించే వైద్యం మాత్రమే కాదు, ఇది జీవన నాణ్యతను పెంచే శాస్త్రం. ఆధునిక పరికరాలు, శాస్త్రీయ పద్ధతులు, నిరంతర పరిశోధనల ఆధారంగా ఫిజియోథెరపీ ఇప్పుడు ఆరోగ్యరంగంలో కీలకమైన స్థానాన్ని సంపాదించింది. మన ప్రాంత ప్రజలందరికీ ఇది అందుబాటులో ఉండాలి అన్న ఉద్దేశ్యంతోనే తక్కువ ధరల్లో, అవసరమైతే ఉచితంగా కూడా సేవలు అందిస్తున్నాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ అసిస్టెంట్ రచన పాల్గొని రోగులకు వైద్యం అందించారు. ఉచిత వైద్య శిబిరం కారణంగా వచ్చిన రోగులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, "తక్కువ సమయంలో మంచి ఫలితాలు చూశాం. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో జరగాలి" అని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఇలాంటి ఫిజియోథెరపీ సేవలను అందుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గౌతమ్ అడ్వాన్స్డ్ ఫిజియోథెరపీ సెంటర్ పీర్జాదిగూడ, ఉప్పల్, మేడిపల్లి ప్రజలకు మరింత చేరువవుతోందన్నారు.







## అర్హత లేని వారితో వైద్యం ప్రమాదకరం

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు
- ముల్కనూర్ ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి

**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్:** అర్హత లేని వారితో వైద్యం వల్ల ప్రాణాలకు ప్రమాదం అని ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బుడగ జంగాల కాలనీలో సోమవారం నాడు వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి, మలేరియా డెంగ్యూ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఔషధాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారు సొంత వైద్యం కానీ, అర్హత లేని వ్యక్తుల దగ్గర కానీ వైద్యం చేయించుకోవడం వలన ప్రాణాలకు ప్రమాదం అని అన్నారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.



## వేములకొండ రైతు వేదికలో యూరియా పంపిణీ

**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** రైతులందరికీ యూరియా అందుబాటులో ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామంలోని రైతు వేదికలో ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున యూరియాలో పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఊరిలోనే యూరియాను అందుబాటులోకి తెచ్చి యూరియా కొరతను తీర్చడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ భువనగిరి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ రిజిస్టర్ సురేష్, మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి, పిఏసిఎస్ అడవులు సీఈవో కృష్ణ, ఏఈవో భగీరథ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మందుబాబుల వీరంగం

- గతంలో పులిగిల్లలో, ఇప్పుడు రెడ్లరేపాకలో
- పాఠశాలల్లో భద్రతా చర్యలు పెంచాలి
- స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి అసాంఘిక శక్తులపై చర్యలు తీసుకోవాలి



**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** దేవాలయం లాంటి ప్రభుత్వ పాఠశాలలో రాత్రి వేళల్లో మందు బాబులు మద్యం సేవించి, సీసాలను పగలగొట్టి పాఠశాలను తాగుబోతులకు అడ్డాగా మార్చారు. కొందరు మందుబాబుల నిర్వాకంతో సరస్వతి నిలయం కాస్తా నిషాలయంగా మారింది. సరిగ్గా ఇలాంటి సంఘటన గతంలో వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో జరగగా, ఆదివారం రోజున రెడ్లరేపాకలో కనిపించిన వైనం. దీనిని సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు చూడగా వారికి తెలిసింది. కొన్ని సందర్భాల్లో కిటికీలను, తలుపులను ధ్వంసం చేస్తున్నారు. ఎవ్వరూ పట్టించుకోకపోవటం వల్ల మందుల బాబులదే ఇష్టారాజ్యంగా మారింది. పాఠశాల అనే విజ్ఞత కూడా లేకుండా స్కూలు తలుపులు, కిటికీలను పగలగొట్టి లోపల మద్యం సేవిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలలో వీరంగం సృష్టిస్తున్న మందుబాబులపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



### సెలవు దినాలలోనే ఇలా..

పాఠశాలకు సెలవు వచ్చిందంటే చాలు మందుబాబులు పాఠశాలలోకి వచ్చి వాలుతారు. ఇక వారికి ఇష్టం వచ్చినట్టు తాగి ఊగుతూ సీసాలు పగలగొడతారని విద్యార్థులు, ఉపాధ్యాయులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికి ఇలా చేయడం విద్యార్థుల యొక్క చదువుకో భంగం కలిగించడం కోసం మాత్రమే అని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పటికైనా దీనిపై చర్య తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

## భార్యను వేదించిన భర్తకు ఏడాది జైలు శిక్ష, జరిమానా

### వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సరోజ



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** భార్యను వేదించిన భర్తకు ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష, 500 రూపాయలు జరిమానా విదిస్తూ కోడంగల్ జుడీష్యల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీరామ్ తీర్పు వెల్లడించినారని వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ సిఐ బి. సరోజ తెలిపినారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు 10తేది 2019 రోజున లగచెర్ల గ్రామానికి చెందిన చౌదర్పల్లి సుజాత మహిళా పోలీసు స్టేషన్ కు వచ్చి తన భర్త, అత్త మామలు అంతా కలీసి తనను అదనపు వరకట్నం కోసం వేదిస్తున్నారు అని ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ జి. శ్రీకాంత్ కౌన్సెలింగ్ నిర్వహించిన పిదప కేసును నమోదు చేసి విచారణ జరిపి నేరస్తుల మీద చార్జ్ షీట్ ను ఫైల్ చేసి కోడంగల్ కోర్ట్ నందు సమర్పించగా, కోడంగల్ మెజిస్ట్రేట్ కేసు యొక్క పూర్వ పరాలు పరిశీలించిన పిదప నేరస్తునికి సంవత్సరం పాటు జైలు శిక్ష, 500 రూపాయలు జరిమానా విదిస్తూ తీర్పు వెల్లడించినారు. ఇట్టి కేసులో నేరస్తునికి శిక్ష పడదేవిదముగా పని చేసిన కోర్ట్ డ్యూటి ఆఫీసర్ సి. రామకృష్ణను వికారాబాద్ మహిళా పోలీసు స్టేషన్ సిఐ బి. సరోజ అబినంధించినారు.



## సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ గా ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రానికి చెందిన సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా నియమితులు అయ్యారు. కోదాడ పట్టణంలో జరిగిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో నియమించడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అల్లం ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నామ నరసింహ రావులు ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో మాణిక్యాలను గుర్తించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నా వంతు కృషి చేస్తానని అన్నారు. నా పై నమ్మకంతో చైర్మన్ గా నాకు అవకాశం కల్పించిన జిల్లా కమిటీ సభ్యులతో పాటు మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కబడ్డీ సీనియర్ క్రీడాకారులు గుణిగంటి వెంకన్న, బోళ్ల వెంకటరెడ్డి, బలికొండ బిక్షం తదితరులు ఉన్నారు.



## పోలీస్ కార్యాలయం తనిఖీ చేసిన జిల్లా ఎస్పి నరసింహ

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** పోలీస్ కార్యాలయాల తనిఖీలలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ నరసింహ సూర్యాపేట రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డ్స్ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సర్కిల్ అధికారిని ఆదేశించారు. కార్యాలయం నందు రికార్డులను మంచిగా నిర్వహించాలని పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు నమోదు పక్కాగా ఉండాలని సూచించారు. అధికారుల పర్యవేక్షణ పటిష్టంగా ఉన్నప్పుడే కింది స్థాయిలో ప్రజలకు విలువైన సేవలు అందుతాయని, సిబ్బంది పటిష్టంగా పనిచేస్తే కేసుల పెండింగ్స్ తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు సర్కిల్ ఎస్సైలు సూర్యాపేట రూరల్ ఎస్సై బాలునాయక్, ఆత్మకూరు ఎస్సై శ్రీకాంత్, చివ్వెంలా ఎస్సై మహేశ్వర్, పెనపహాడ్ ఎస్సైగోపికృష్ణ, డిసిఆర్బి ఎస్ఐ యాకూబ్, డిసిఆర్బి ఎస్ఐ అంజన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శేఖర్ రెడ్డి, సీసీ సందీప్ ఉన్నారు..



## సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు
# ఆరోగ్య క్యాంపులు

- స్వస్తు నారి స్వశక్త్ పరివార్ అభియాన్
- డిఎంహెచ్ఓ లలితా దేవి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఎం ఎల్ హెచ్ పిలతో వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే లలితాదేవి జూమ్ సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వస్తు నారి స్వశక్త్ పరివార్ అభియాన్ ( అతివ ఆరోగ్య మస్తు) కార్యక్రమంను వికారాబాద్ జిల్లాలో కూడా నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17,అక్టోబర్ 2 తేదీలలో మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 18 నుండి అక్టోబర్ 1వ తేదీ వరకు ప్రతిరోజు పది ఆరోగ్య క్యాంపులు ( నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లు, ఒక సామాజిక ఆరోగ్య కేంద్రం, ఒక ప్రైవేటు ఆసుపత్రులలో) నిర్వహించడం జరుగుతుందన్నారు. హెల్త్ క్యాంపులలో మహిళల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు అందించడం జరుగుతుంది. ముఖ్యంగా మహిళా ఆరోగ్య సంరక్షణకు స్క్రీనింగ్ ప్రక్రియ, మాతృ, శిశు సంరక్షణ స్క్రీనింగ్, మహిళలకు, యుక్త వయసు బాలికలకు ఋతు సంబంధ సమస్యలు, పోషకాహారం అవగాహన, టీబీ స్క్రీనింగ్, చికిత్స ద్వారా టిబి ముక్త్ అభియాన్ కార్యక్రమం, ఇతర స్త్రీలకు సంబంధించిన అన్ని రకాల ఆరోగ్య సమస్యల పరిష్కారం కొరకు హెల్త్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుంది. ఈ క్యాంపులలో స్పెషలిస్ట్ వైద్యులచే స్క్రీనింగ్ నిర్వహించడం జరుగుతుంది. మెగా హెల్త్ క్యాంపులలో రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ హెల్త్ క్యాంపులను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, నగరాలు, గ్రామాలలోని యువజన సంఘాలు, స్వయం సహాయక మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖుల సమన్వయంతో నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మెగా హెల్త్ క్యాంపులు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఇతర శాఖలు, వివిధ సంఘాల సమన్వయం తో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ డి ఎం హెచ్ డాక్టర్ రవీంద్ర యాదవ్, ప్రోగ్రామ్ అధికారిని డాక్టర్ పవిత్ర, డాక్టర్ బీబీ జానీ, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ గోపాల్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు
# రాజకీయ ప్రతినిధులు సహకరించాలి
### - వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** రాబోతున్న స్థానిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ కోరారు. సోమవారం వికారాబాద్ జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ లోని ఛాంబర్లో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామ పంచాయితీలలో ఓటర్ల జాబితా, జిల్లాలో 2025, జూలై 1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజక వర్గాల వారి ఓటరు జాబితాననుసరించి గ్రామ పంచాయితీ, వార్డుల వారిగా ఓటరు జాబితా సిద్ధం చేయడం జరిగింది. అలాగే పోలింగ్ బూత్ ల జాబితా, పోలింగ్ కేంద్రాల విషయం ఏవేని అభ్యంతరాలు ఉన్నట్లు అయితే తెలియజేయవచ్చని ఆయన తెలిపారు. జిల్లాలోని 594 గ్రామ పంచాయతీలలో 5058 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు . జిల్లాలో 6,98,478 ఓటర్లు నమోదు అయ్యారని, ఇందులో 343672 మంది పురుషులు, 354790 మంది మహిళలు, 16 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీపీఓ జయసుధ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలి
### వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లాలో భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను అన్ని మాడల్స్ లో పరిశీలించి పూర్తి చేయాలనీ వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తహసిల్దార్లకు ఆదేశించారు. సోమవారం వికారాబాద్ కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు అన్ని మండలాల తహసిల్దార్లతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్సులో అయన మాట్లాడుతూ జిల్లా లో రెవెన్యూ సదస్సుల ద్వార వచ్చిన దరకాస్తులను పూర్తి స్తాయిలో పరిశీలించి డేటా ఎంట్రి చేయాలనీ, గ్రామాలవారిగా రైతుల నుండి తీసుకున్న ప్రతి దరకాస్తులకు సంబంధించి సాధా బైనామా, ఆర్ఓఆర్ సమస్యలు, పట్టాలో కరెక్షన్స్ వంటి వివిధ సమస్యలపై దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పూర్తి అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన పెండింగ్ దరఖాస్తులను పరిష్కారంకు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ లను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులు, భూభారతిలో వచ్చిన అప్లికేషన్లను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, రిజెక్ట్ అయిన అప్లికేషన్లు, పరిష్కరించిన అప్లికేషన్లు, పెండింగ్లో ఉన్న అప్లికేషన్ల వివరాలను మండలాల వారీగా సంబంధిత మండల తహశీల్దార్ లను అడిగి తెలుసుకున్నారు. ఏ ఒక్క అప్లికేషన్ ను పెండింగ్ లో పెట్టకుండా వెంటనే పూర్తి చేయాలని తహశీల్దార్ లను ఆదేశించారు. రేషన్ కార్డు కోసము వచ్చిన దరకస్తులను పూర్తి స్తాయిలో పరిశీలించి అర్హత కలిగిన వారికే రేషన్ కార్డు వచ్చేలా చూడాలని, ఏట్టి పరిస్థితిలో అర్హత లేని వారికీ రేషన్ కార్డు వెళ్ళకుండా చూడాల్సిన బాద్యత తహసిల్దార్ల దేనని సూచించారు. ఈ సమావేశం లో డి ఆర్ ఓ మంగి లాల్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ఆర్ డి ఓ వాసుచంద్ర , అన్ని మండలాల తహసిల్దార్లు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులలో
# నాణ్యత ప్రమాణాలు పాటించాలి
### మాజీ మేయర్ అమర్ సింగ్

- స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడిగె స్వాతి కృష్ణ గౌడ్, బండారి రవీందర్, యాసారం మహేష్ లతో కలిసి పర్వతాపూర్ పోచమ్మకుంట వద్ద రోడ్డు పనుల పర్యవేక్షణ



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సిసి రోడ్డును పటిష్టంగా నిర్మించాలని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పీర్జాదిగూడ నగర మాజీ మేయర్ అమర్ సింగ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడిగె కృష్ణ గౌడ్, బండారి రవీందర్, యాసారం మహేష్, మల్లికార్జున్ నగర్ కాలనీ వాసులతో కలిసి సిసి రోడ్డు పనులను పర్యవేక్షించారు. ఈ



సందర్భంగా వారు మాట్లాడుతూ... పర్వతాపూర్ చెరువు కట్టపై సీసీ రోడ్డు నిర్మించడంలో బొడిగె స్వాతి కృష్ణ గౌడ్ బాగా కృషి చేశారని అన్నారు. డివిజన్ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రతినిత్యం పై అధికారులతో మాట్లాడే త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు కష్టపడ్డారని అన్నారు. చాలాకాలంగా పెండింగ్లో ఉన్న ఈ రహదారి పూర్తవడం ద్వారా పర్వతాపూర్ – మేడిపల్లి –పీర్జాది గూడ ప్రాంతాలకు అనుసంధానం ఏర్పడుతుంది. రవాణా సౌకర్యం మెరుగుపడటమే కాకుండా ప్రజలకు సులభతరం, సౌకర్యవంతమైన రాకపోకలు అందుతాయని తెలిపారు. స్థానికులతో మాట్లాడి పనుల పురోగతిని సమీక్షిస్తూ, ప్రజలకు వీలైనంత త్వరగా ఈ రహదారి అందుబాటులోకి రావాలని ప్రత్యేకంగా దృష్టి సారించారు. దీనివలన ప్రజలకు సౌకర్యవంతంగా ట్రాఫిక్ లేకుండా సౌలభ్యంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ నగర్ కాలనీ వాసులు శేషు, ఓబుల్ రెడ్డి, వార్డు ఆఫీసర్ అతిక్, నాని తదితరులు పాల్గొన్నారు.

## రూ.1,25,000 ధర పలికిన విజయ శ్రీ కాలనీ లడ్డు



**ఎల్బీనగర్ :** మన్సురాబాద్ డివిజన్ విజయ శ్రీ కాలనీ లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో కాలనీ సభ్యులు పైళ్ల సత్తిరెడ్డి అండాలు దంపతులు రూ. 1,25,000/- లకు స్వంతం చేసుకున్నారు. చిన్న లడ్డూను రూ. 45,116/- లకు పట్టబత్తుల మోహన్ - పద్మ దంపతులు, కలశంను రూ. 45,116/- లకు కాలనీ అధ్యక్షులు జొన్నాడ మోహన్ రెడ్డి, మీనా దంపతులు గెలుచుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు కాలనీ సంక్షేమసంఘం సభ్యులు, మహిళలు, పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## బిసి కులాల బీసీ సంఘాల ఐక్యవేదిక
## రౌండ్ టేబుల్ సమావేశం.. హాజరైన ప్రముఖులు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** 42 శాతం రిజర్వేషన్ అమలు చేసే విధంగా బీసీ కుటుంబాలు బీసీ కులాల అన్ని సంఘాలు ఒకటై రాష్ట్ర ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వం. ప్రతిపక్షాలను ఒప్పించే విధంగా బీసీ ప్రజల ముఖ్య ఎజెండాగా శేరిలింగంపల్లి డివిజన్ నిరుషా బ్యాంకెట్ హాలో సంగం మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య తనయుడు డాక్టర్ అరుణ్ మాట్లాడుతూ... 52 సంవత్సరాలుగా బీసీ కులాలకు మతాలకు అతీతంగా ఆర్ కృష్ణయ్య సహకారంతో ఉద్యమాలు చేస్తున్నారని. తమిళ్ నాడులో బీసీ రిజర్వేషన్ అమలై చట్టసభల్లో బీసీలకు అవకాశం దక్కిందని అదేవిధంగా ఆర్ కృష్ణ అన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించి దేశమంతటా అమలు చేయాలని కృష్ణన్న కంకణం కట్టుకున్నారని ఆయన అన్నారు. బీసీలు వ్యాపారవేత్తగా ఎదగాలి కొందరు నా మిత్రులు వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వాళ్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ఉపాధి కల్పిస్తున్నారని అదేవిధంగా ప్రతి ఒక్కరు మీ పిల్లలను ఉన్నతమైన చదువులు చదివించాలని అమెరికాకు పంపించాలని అరుణ్ కోరారు. కార్పోరేటర్. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మంచిదని తద్వారా బీసీలకు సరైన న్యాయం జరుగుతుందని. బీసీలు బీసీలకు న్యాయం చేసే విధంగా. ప్రజాప్రతినిధులుగా రాజకీయ పార్టీల ద్వారా ఎన్నికలలో పోటీ చేసినప్పుడు.



మంచి మనసుతో డబ్బులకు అగ్రవర్ణాల కింద పనిచేయకుండా. బీసీ నాయకుడిని గెలిపించే విధంగా ప్రయత్నం చేయాలని సంఘాల మీటింగ్లు తో సరిపెట్టకూడదని. బీసీలు సంఘటితం అయ్యే విధంగా ప్రతి మీటింగ్ ఉండాలని ఆయన అన్నారు, ఏ రాజకీయ పార్టీకి తొత్తుగా బీసీ సంఘాలు పనిచేయదని అన్నారు, కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ పై మన హక్కులపై మీటింగ్ పెట్టడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు రామచంద్ర యాదవ్, ఆర్.కే సాయన్న, టి రామస్వామి యాదవ్, ఓంగురు శ్రీనివాస్ యాదవ్, వీరేశం గౌడ్, ఎం.రవియాదవ్, మహిపాల్ యాదవ్, జంగం గౌడ్, శ్రీరాములు, సునంద కృష్ణమూర్తి చారి, ప్రశాంతు, సంగమ్మ, మంగు భాయ్, వాసుకి, విజయలక్ష్మి, అనిత, అంజలి, కే ఎన్ రాములు, లలిత రాణి, రవీందర్ గౌడ్, నాగేశ్వర్ గౌడ్, నర్సింలు, బండి రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## లంబాడిలపై అసత్య ప్రచారం చేస్తున్నా
# కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

- సోయం బాబురావును పార్టీ నుండి సస్పెండ్ చెయ్యాలి
- లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయం నుండి బాబాసాహెబ్ అంబేద్కర్ చౌరస్తా వరకు గోర్ సేన లంబాడి హక్కుల పోరాట సమితి బంజారా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిరసన నిర్వహించడం జరిగింది. ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్ మాట్లాడుతూ బంజారా లంబాడిలు సింధు నాగరికత కాలం నుండే ఈ దేశ మూలని వాసులు భారత దేశ స్వాతంత్రానికి ముందే గిరిజనులుగా గుర్తింపు పొందినము, 1871లో బ్రిటిష్ పాలకులు బంజారాలను క్రిమినల్ ట్రైబ్స్ జాబితాలో చేర్చారని అన్నారు. 1931 లో నిజాం రాజులు చేపట్టిన కులగణనలో బంజారా లంబాడిలను గిరిజనుల పట్టికలో చూపించారు. 1956 లో ఆంధ్రప్రదేశ్ రాష్టం ఏర్పడినప్పుడు ఆంధ్ర ప్రాంతంలోని లంబాడిలు, సుగాలిలను భారత పార్లమెంట్ ఉభయసభల ఆమోదంతో ద షెడ్యూల్ క్యాస్ట్ అండ్ ద షెడ్యూల్ ట్రైబ్స్ లిస్ట్ ఆర్డర్ – 1956 ప్రకారం గిరిజనులుగా గుర్తింపు పొంది గిరి జన జాబితాలో సీరియల్ నెంబర్ 19 గా చేర్చాబడ్డారని పేర్కొన్నారు. ఒకే రాష్టంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన గిరిజన లంబాడిలను సుమారు 25 సమ త్సరాలు గిరిజన జాబితాలో చేర్చకపోవడానికి అప్పటి కాంగ్రెస్ పార్టీ లంబాడి లను ఘోరమైన అన్యాయం చేసింది అని అన్నారు,1969 కే చందా అధ్యక్షతన వేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ రిపోర్ట్ ఆధారంగా నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ నెత్రు త్వంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ఉభయ సభల ఆమోదంతో ద షెడ్యూల్ క్యాస్ట్ అండ్ ద షెడ్యూల్ ట్రైబ్స్ (సవరణ) యాక్ట్ 1976 (యాక్ట్ నెంబర్ 108 అఫ్ 1976) తేదీ : సెప్టెంబర్ 19, 1976 చట్టం చేసి తెలంగాణ ప్రాంతానికి చెందిన లంబాడిలను గిరిజన జాబితాలో క్రమ



సంఖ్య 29 లో చేర్చారని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డీ గత శాసన సభ ఎన్నికల్లో లంబాడిల ఓట్లతోనే కాంగ్రెస్ పార్టీ తాను గద్దెనెక్కనని అనేక సభలలో ప్రకటించారు. 2017 లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ప్రాంతంలో హింసత్మక ఘటనకు పాల్పడిన సోయం బాబురావు, తెల్లం వెంకట్రావు లను కాంగ్రెస్ పార్టీ లోకి చేర్చుకున్నారు. తేదీ 24 జూలై 2025 నా వీరిద్దరూ లంబాడిలను గిరిజన జాబితా నుండి తొలగించాలని రిట్ ఫిటిషన్ దాఖాలు చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీ ఆదేశాల ప్రకారమే జరిగిందా..? దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డీ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లంబాడిలకు సమాధానం చెప్పాలన్నారు. దీనిపై బి ఆర్ ఎస్, బీజేపీ ల వైఖరి కూడా ఎటువైపో..? సమాధానం చెప్పాలి అని అన్నారు. ఈ కార్యక్రంలో గోర్ సేన వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామావత్ నవీన్ నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ దోమ మండల కార్యదర్శి మూడవత్ రవీందర్, చిట్టంపల్లి తండా మాజీ సర్పంచ్ కాశిరం నాయక్, వడిత్యా రవీందర్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టేకులపల్లి మాజీ సర్పంచ్ దీప్లా నాయక్, గోపాల్ నాయక్, గుడుపల్లి గణపతి నాయక్, లచ్చునాయక్ తండా, చందర్ నాయక్, కాస్లాబది తండా రాజు నాయక్, బన్సీలాల్ నాయక్, విద్యార్థులు, మోమిన్ పేట మండల తండల పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## మున్నూరు కాపులందరూ
# సభ్యత్వ నమోదు చేసుకోవాలి
### పీర్జాదిగూడ మున్నూరు కాపు అధ్యక్షులు బల్లెపు చంద్రశేఖర్

- శ్రీనగర్‌కాలనీలోని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించి రాష్ట్ర అధ్యక్షులు రూటం పురుషోత్తమును సన్మానించిన సంఘం సభ్యులు
- అనంతరం సభ్యత్వ బుక్కును అందజేసిన మున్నూరు కాపు సంఘం నాయకులు

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** మున్నూరు కాపు సంఘం సభ్యులందరూ సంఘటితమై ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుటం పురుషోత్తం తెలిపారు. ఈ మేరకు సోమవారం హైదరాబాదులోని శ్రీనగర్ కాలనీ లోగల మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యాలయాన్ని పీర్జాదిగూడ నగర కార్పొరేషన్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బల్లెపు చంద్రశేఖర్ పటేల్ సందర్శించి రాష్ట్ర అధ్యక్షులు పుటం పురుషోత్తమును శాలువాతో సన్మానించి సభ్యత్వ బుక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పోతంశెట్టి భరత్ కుమార్ పటేల్, కోనేటి వెంకట్ పటేల్, మేడిపల్లి శ్రీ వీరాంజనేయ స్వామి దేవాదాయ, ధర్మాదాయ శాఖ డైరెక్టర్ సింగం లక్ష్మణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## మండలంలోని అన్ని గ్రామాల
# సమస్యలు పరిష్కరించాలి : సిపిఐ
### తాహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** వలిగొండ మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాన సమస్యలు పరిష్కరించాలని తాహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగినది. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని వరికి ఎకరాకి 30 వేల రూపాయలు ఇవ్వాలని, పత్తికి ఎకరాకి 50 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవలే కురిసిన వర్షాలకు చెదిరిపోయిన రోడ్లను మరమ్మత్తులను చేయాలని, గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలనలో చాలా సమస్యలు పేరుకుపోయినయాని, ప్రధానంగా వీధిలైట్లు,శానిటైజర్, సమస్యలను పరిష్కరించాలని , గత 15 రోజుల నుండి యూరియా దొరకక రైతాంగం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫెర్టిలైజర్ షాపుల ముందు సొసైటీ ముందు రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు వెంటనే సొసైటీల ద్వారా యూరియ సరఫరా చేయాలిని స్థానిక తహసిల్దార్ జి. దశరథ కి మెమోరండం సమర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, మండల పార్టీ కార్యదర్శి సలిగంజి వీరస్వామి, రైతు సంఘం నాయకులు ఎలగందుల అంజయ్య, జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి సల్వాద్రి రవీందర్, బాలగణ సత్యనారాయణ,నరిగే యాదయ్య, కట్ల యాదగిరి, పులిపలుపుల మల్లేశం,బత్తుల బిక్షపతి, చేగురి పాపయ్య, కోయగుర్ రాముల్లు, పోశబోయిన బొందయ్యా,పూడూరి అశోక్, వడ్డేపల్లి లక్ష్మమ్మ, గుండె గాని అంజయ్య, మాద సోమయ్య, మెట్టు లక్ష్మీనారాయణ, అంతటి రాము, బాలగని రాజు, చంద్రగిరి చంద్రయ్య, ఆయిలి వెంకటేశం, పాలకూర రఘుపతి, ఏనుగుల రాములు, బుంగ చక్రం, బీసు లచ్చయ్య, రాపోలు పవన్ కుమార్, కామెల్ల పురుషోత్తం పాల్గొన్నారు.



## ఆరంభ్ టౌన్షిప్ గణేష్ వేలంపాట

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** పాపిరెడ్డి కాలనీ ఆరంభ్ టౌన్షిప్ లో జరిగిన గణేష్ లడ్డు వేలంపాట మత సామరస్యం కు ప్రతీక గా ఆదర్శంగా నిలిచింది. మునుపు ఎప్పుడు లేని విధంగా రికార్డ్ ధరకు సలీమ్, అలీమ్ బ్రదర్స్ వేలంపాట లో నవరాత్రులు పూజలు, నిత్య పూజలు భక్తి శ్రద్ధలతో గణనాథుడి వద్ద పూజలందుకొన్న స్వామీ వారి లడ్డూ ను వేలం పాట లో దక్కించుకోటం జరిగింది. ఆరంభ్ టౌన్షిప్ అసోసియేషన్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సకల హంగు ఆర్భాటాల తో బాండ్ బాజాలతో సలీమ్ అలీమ్ బ్రదర్స్ ను శాలువా లతో సత్కరించి స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళల వారితో పాటు గా వారి కుటుంబ సభ్యులకు స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షిస్తు లడ్డూ అందచేయటం జరిగింది. ఇలా విశ్వ నగరంచరిత్ర లో మత సామరస్యం వెల్లివిరిసింది.



## ఘనంగా పొడువు శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్ :** శంకర్ పల్లి మండల గోపులారం మాజీ సర్పంచ్ పొడువు శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు సోమవారం సొంత గ్రామంలో కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు హాజరై అయనకు శుభాకాంక్షలు తెలిపారు. పొడువు శ్రీనివాస్ మాట్లాతూ...తన కుటుంబ సభ్యులు, అభిమానులు, బంధుమిత్రుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.



## భగత్‌సింగ్ కాలనీలో స్వల్ప అగ్ని ప్రమాదం

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తుంగతుర్తి రవి
- ఆర్.వి ఫౌండేషన్ ద్వారా 50 కిలోల బియ్యం అందజేత
- భగత్ సింగ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఒకటో డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ కాలనీలో ప్రమాదవశాత్తు ఒక గుడిసెలో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో గుడిసెలో ఉన్న కొన్ని నిత్యవసర సరుకులు పాక్షికంగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శి ంచారు. ఆర్.వి ఫౌండేషన్ ద్వారా తక్షణ సాయంగా బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని తుంగతుర్తి రవి అందించి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ... దేవుడి పూజలో వెలిగించిన దీపం కారణంగా మంటలు వ్యాపించాయని చుట్టుపక్కల వాళ్ళు గమనించి మంటలు ఆర్పడంతో బారీ ప్రమాదం తప్పిందని ఆయన అన్నారు. అదేవిధంగా కాలనీలో మంచినీటి సమస్య,డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం, వీధి దీపాలు లేకపోవడం, కరెంటు వైర్లపై చెట్టుకొమ్మలు పడడం తదితర సమస్యలను గమనించిన తుంగతుర్తి రవి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి భగత్ సింగ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎం డి మజహర్,బర్రె నాగరాజు, కాలనీ వాసులు,తదితరులు పాల్గొన్నారు.




## రూ.1,29,116లు పలికిన బిపిఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీ గణనాధుని లడ్డు

- వేలంలో గణనాధుని లడ్డు దక్కించుకున్న బిపిఎం కాలనీ వాసులు శ్రవణ్ కుమార్, అన్నపూర్ణ దంపతులు
- గణనాధుని పంచె రూ. 9,216/-, లకు శ్రవణ్ కుమార్ దంపతులు, కండువా రూ. 5,016/- లకు దక్కించుకున్న అమర్ చంద్ దంపతులు



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్ :** గణనాధుని ఆశీస్సులు కాలనీ ప్రజలందరిపై ఉండాలని కాలనీ ప్రజలను చల్లంగా చూడాలని పీర్జాదిగూడ నగర మాజీ కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణ గౌడ్ తెలిపారు. ఈ మేరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పీర్జాదిగూడ నగర పరిధిలోని 5వ డివిజన్ బీపీఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీలో కొలువైన గణనాధుని లడ్డూను వేలం వేశారు. కాలనీకి చెందిన శ్రవణ్ కుమార్ అన్నపూర్ణ దంపతులు గణనాధుని లడ్డూను రూ. 1,29,116/- లకు , పంచెను రూ. 9,216/- హోరాహోరీగా సాగిన వేలం పాటలో దక్కించుకున్నారు. అదేవిధంగా గణనాధుని కండువాను రోడ్ నెంబర్ 6 కు చెందిన అమర్ చంద్ దంపతులు 5,016/- లకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గణనాధుని లడ్డూను పట్టు వస్త్రాలను వేలంపాటలో దక్కించుకోవడం అదృష్టంగా భావిస్తున్నావని తెలిపారు. నవరాత్రులు పూజలు అందుకున్న గణనాధుడి చేతిలోని లడ్డు ప్రసాదం పొందడం శుభ పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎం. కిరణ్ గౌడ్, కాలనీ అధ్యక్షులు మునుకుంట్ల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రావు నాగిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవుల కృష్ణ, కోశాధికారి మునుకుంట్ల ప్రదీప్ గౌడ్, ఉపాధ్యక్షులు రాపల్లి వేణు, జాయింట్ సెక్రటరీలు జె. శ్రవణ్, జి. వెంకటరమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎస్. సుధాకర్, మురళి అచ్యుతారావు, ప్రభాకర్ వర్మ, కార్యవర్గ సభ్యులు ఎం. వెంకటేష్, పరమేశ్వర్, ఓం ప్రకాష్, రాము, రామకృష్ణ, రాజు, కాలనీ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

## భారత్ వంటి దేశాలపై ఆంక్షలు సరైన నిర్ణయమే : జెలెన్‌స్కీ



**ఉక్రెయిన్ :** రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేసే భారత్ వంటి దేశాలపై ఆంక్షలు విధించడం సరైన నిర్ణయమేనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. మాస్కో-కీవ్ మధ్య సంధి కుదిర్చేందుకు భారత్ దౌత్య యత్నాలు చేస్తున్నా ఆయన నుంచి ఇటువంటి వ్యాఖ్యలు రావడం గమనార్హం. జెలెన్‌స్కీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "రష్యాతో వ్యాపార లావాదేవీలు చేస్తున్న దేశాలపై టారిఫ్‌లు విధించ డం సరైన చర్యే" అని పేర్కొన్నారు. ఇటీవల షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ తియాంజెన్‌లో చైనా అధినేత జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కలిసి వేదిక పంచుకోవడంపై స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అలాస్కాలో ట్రంప్-పుతిన్ చర్చలు విఫలమైన నేపథ్యంలో రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించేందుకు అమెరికా సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో జెలెన్‌స్కీ ప్రకటన వెలువడటం గమనార్హం. నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హస్సెట్ మాస్కోపై మరిన్ని సరికొత్త ఆంక్షలు విధిస్తారని వెల్లడించారు. "ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధంలో సహకరించే వారిపై ఆంక్షలు అమలయ్యేలా చూసే బాధ్యత మాదే. ఉదాహరణకు భారత్ ఇంకా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ఈ నేపథ్యంలో దీనిపై స్పందించేం దుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఆంక్షల స్థాయి.. వాటిని విధించిన సమయంపై ప్రస్తుతం, భవిష్యత్తులో కూడా మాట్లాడుకొంటారు" అని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించాలని భారత్ కూడా ప్రయత్నాలు చేస్తోంది. ప్రధాని మోదీ అటు పుతిన్, ఇటు జెలెన్‌స్కీతో చర్చలు జరుపుతున్నా రు. గత నెల రెండో వారంలో పుతిన్‌తో భేటీకి ముందు ఉక్రెయిన్ అధినేతతో మాట్లాడారు. "ఉక్రెయిన్‌కు సంబంధించి ఇటీవలి పరిణామాలపై జెలెన్‌స్కీతో మాట్లాడి, ఆయన అభిప్రాయాలు తెలుసుకున్నాను. ఈ వివాదాన్ని వీలైనంత త్వరగా, శాంతియుతంగా పరిష్కరించడంపై భారత్ స్థిరమైన వైఖరి గురించి తెలియజేశాను. యుద్ధం ముగింపు విషయంలో సాధ్యమైన సహకారాన్ని అందించేందుకు, ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకు నేందుకు భారత్ కట్టుబడి ఉంది" అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. తామిద్దరం కీలక అంశాలపై వివరంగా చర్చించినట్లు జెలెన్‌స్కీ సైతం పేర్కొన్నారు. అయినా ఆయన నుంచి భారత్‌పై ప్రతికూల ప్రకటన వెలువడటం గమనార్హం.

## 'సైడ్ ఇన్‌కమ్' ఉంటే బహిష్కరణ ముప్పు

### వీసాదారులకు నిపుణుల అలర్ట్



**యూఎస్ :** అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న ట్రంప్ యంత్రాంగం.. అనేకమందిని దేశం నుంచి తిప్పి పంపేందుకు విస్తృత అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగా హెచ్1బీ లేదా ఎఫ్-1 వీసాదారుల అనధికారిక సంపాదన పైనా దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఈమేరకు పన్ను చెల్లింపుదారుల సమాచారాన్ని ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్.. అమెరికా ఇమిగ్రేషన్ అధికారులకు అందజేయడం మొదలుపెట్టినట్లు తెలిసింది. దీంతో సైడ్ ఇన్‌కమ్‌పై ఆధారపడే అనేకమందికి బహిష్కరణ ముప్పు ఉన్నట్లేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రాయబార కార్యాలయాలు, పోర్టుల వద్ద ప్రవేశ సమయంలో హెచ్-1బీ వీసాదారులను ప్రత్యేకంగా ప్రశ్నిస్తున్న ఇమిగ్రేషన్ అధికారులు, గతంలో విద్యార్థులుగా ఉన్నప్పుడు అనధికారికంగా పనిచేసిన విషయాలను తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్నిసార్లు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినప్పుడు బ్యాక్‌గ్రౌండ్ మొత్తాన్ని పరిశీలిస్తున్న అధికారులు.. ఏళ్ల క్రితం అనధికారికంగా చేసిన పార్ట్‌టైమ్ ఉద్యోగాల సమాచారాన్ని రాబట్టే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఐఆర్ఎస్ ద్వారా పన్ను రికార్డులను పరిశీలించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. వీటికితోడు 'సోషల్ మీడియా వెట్టింగ్' ద్వారా వీసాదారుల ప్రవర్తనపై ఓ అంచనాకు వస్తున్న సంగతి తెలిసిందే. వలసదారుల ఆర్థిక సమాచారాన్ని ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ విభాగం అందిస్తోందని అమెరికా మీడియా ఇటీవలే పేర్కొంది. తద్వారా పన్నులు చెల్లించిన, దాఖలు చేసిన ఆదాయం కంటే అనధికారికంగా సంపాదన గురించి క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం ఉందని ఇమిగ్రేషన్ న్యాయ నిపుణులు చెబుతున్నారు. అయితే, ఇవి ఇంకా విస్తృతం కానప్పటికీ.. క్లయింట్‌లు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. బహిష్కరణ ముప్పును తప్పించుకోవాలంటే అనధికార ఉద్యోగాలు(చిన్న మొత్తంలో కూడా) చేపట్టకుండా ఉండాలని, ఏమైనా అదనపు సాయం కోసం న్యాయసంస్థల నుంచి సలహాలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



## గాజాపై విరుచుకుపడనున్న హరికేన్

### ఇజ్రాయెల్ హెచ్చరిక


**గాజా :** గాజాను పూర్తిగా ఖాళీ చేయించే పనిని ఇజ్రాయెల్ వేగవంతం చేసింది. దీనిలోభాగంగా ఆ దేశ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తీవ్ర స్థాయిలో హమాస్‌కు హెచ్చరికలు చేశారు. ఆయుధాలు అప్పజెప్పి బందీలను విడుదల చేయించే వరకు తీవ్రస్థాయిలో దాడులు తప్పవన్నారు. "ఈ రోజు రాత్రి గాజా సిటీపై శక్తిమంతమైన హరికేన్ తాకనుంది. టెర్రర్ టవర్స్ పైకప్పులు దీని దెబ్బకు కుప్పకూలనున్నాయి" అని పేర్కొన్నారు. మరో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గాజా లోపల, బయట ఉన్న హమాస్‌కు ఇదే తుది హెచ్చరిక చేస్తున్నామన్నారు. బందీలను తక్షణం విడిచిపెట్టి ఆయుధాలను పడవేయాలని లేదా గాజా నాశనమైపోతుంది.. మిమ్మల్ని పూర్తిగా నిర్మూలిస్తాం" అని పేర్కొన్నారు. తమ ప్రణాళిక ప్రకారం గాజాలో ఆపరేషన్ కొనసాగుతుందని కట్జ్ చెప్పారు. హమాస్‌ను పూర్తిగా అంతం చేయాలనే లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో మోహరింపులు ఉంటాయని చెప్పారు.

### ట్రంప్ కూడా తీవ్ర హెచ్చరికలు..

మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా హమాస్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. షరతులకు అంగీకరించి యుద్ధాన్ని ముగించాలన్నారు. ఇప్పటికే ఇజ్రాయెల్ తాను ప్రతిపాదించిన కాల్పుల విరమణ, బందీల అప్పగింత షరతులకు అంగీకరించిందన్నారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ట్రంప్ ప్రతిపాదనల ప్రకారం తొలుత అందరు బందీలను విడిచిపెట్టాలి. ఆ తర్వాత యుద్ధాన్ని ముగించాలి. దీనిని అంగీకరించకపోతే హమాస్ ఆ పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఇదే తన చివరి వార్నింగ్ అని.. ఆ తర్వాత ఇక ఇలాంటివి ఉండవని చెప్పారు. ట్రంప్ ఆఫర్‌ను అంగీకరించినట్లు ఇజ్రాయెల్ ఎక్కడా చెప్పకపోయినా.. తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు మాత్రం వెల్లడించింది.

### చర్చలకు సిద్ధం : హమాస్

అమెరికా సూచించిన కొన్ని ప్రతిపాదనలపై తాము తక్షణం చర్చలకు సిద్ధమని హమాస్ మరోవైపు వెల్లడించింది. ఈ విషయాన్ని అల్‌జజీరా పేర్కొంది. ట్రంప్ నుంచి తుది హెచ్చరిక వెలువడిన నేపథ్యంలో హమాస్ స్వరం మార్చింది.



## ఉద్యమ ధ్వజం

### "కాళోజి" జయంతి

అక్షరాలను అగ్ని కణాలుగా
విరజిమ్మావు
అఖిలాండంలోని అనాథలగాథలను
వినిపించావు
అహంకారం గద్దెక్కితే
అణగదొక్క గర్జించావు
అధికారం ముసుగులో
హక్కులు నలిపేస్తుంటే
కాళిక వై కదిలావు
ప్రశ్నించే తత్వానికి ప్రహల్లాదుడే
గురువని ప్రవచించావు
ఉప్పెనలా ఎగిసిపడే ఉద్యమాలకెన్నిటికో
ఊపిరిగా నిలిచావు
ప్రజల భాషలో ప్రజల గొడవకు
పట్టం కట్టావు
నిర్భీతి నిర్మోహం నిజాయితీలనే
త్రికరణశుద్ధిగా పాటించావు
సామాన్యుడిగా ఉంటూనే సాహసంతో
సత్యాగ్రాహిగా బతికావు
తెలంగాణ పోరు తేరుపై
"ఉద్యమధ్వజంగా"
మిగిలావు.



– డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
9989148305

## నవారోపై 'ఎక్స్' ఫ్యాక్ట్‌చెక్..

### మస్క్ ఏమన్నారంటే..?



**యూఎస్ :** భారత్‌ను బెదిరించేందుకు ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో ఏ ప్రయత్నాన్ని విడిచిపెట్టడం లేదు. దేశంలోని కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకొని రెచ్చగొట్టేలా పదే పదే నోరుపారేసుకుంటున్నారు. కాగా ఆయన చేస్తున్న ఆరోపణలు అబద్ధమని సోషల్ మీడియా 'ఎక్స్' 'ఫ్యాక్ట్ చెక్' చేసి రుజువు చేసింది. ఈ విషయంపై తాజాగా 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్ స్పందించారు. ఎవరు తప్పు చేసినా ఎక్స్ కమ్యూనిటీ నోట్స్ సరిచేస్తుందని తెలిపారు. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదని ప్రపంచ కుబేరుడు స్పష్టం చేశారు. సోషల్ మీడియా గ్రోక్ మరింత వాస్తవ తనిఖీలను వినియోగదారులకు అందిస్తుందన్నారు. భారత్ విధిస్తున్న సుంకాల వల్ల అమెరికా ఉద్యోగాలు దెబ్బతింటున్నాయి. లాభం కోసమే ఆ దేశం రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ఉక్రెయిన్‌తో మాస్కో చేస్తున్న యుద్ధాన్ని పోషిస్తోంది' అని నవారో ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. ఈ పోస్టుపై 'ఎక్స్' ఫ్యాక్ట్ చెక్ చేసి.. ఆ వ్యాఖ్యలను కొట్టిపారేసింది. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోంది ఇంధన భద్రత కోసమేనని పేర్కొంది. ఆ దేశం ఎలాంటి ఆంక్షలను ఉల్లంఘించడంలేదని స్పష్టం చేసింది. యూఎస్ కూడా రష్యా నుంచి వస్తువులు దిగుమతి చేసుకుంటున్న విషయాన్నీ ప్రస్తావించింది. నవారో వ్యాఖ్యలు కపటమైనవిగా పేర్కొంది. ఈ ఫ్యాక్ట్ చెక్‌పై నవారో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్‌పై కూడా ఆయన విరుచుకుపడ్డారు. 'ఎక్స్' నిర్వహించిన ఫ్యాక్ట్ చెక్ ఒక చెత్తగా అభివర్ణించారు. భారత ఉత్పత్తుల దిగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ టారిఫ్‌లను కొందరు అమెరికా విశ్లేషకులు తప్పుపట్టగా.. పీటర్ నవారో, బెసెంట్ వంటి వారు మాత్రం భారత్‌ను ఉద్దేశిస్తూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకొని నవారో ఇటీవల చేసిన వ్యాఖ్యలను భారత్ ఖండించింది. ఆయన మాటలు తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది.

## తీరానికి కొట్టుకొచ్చిన అనుమానాస్పద కంటైనర్లు.. మహారాష్ట్రలో అలర్ట్



**మహారాష్ట్ర :** మహారాష్ట్రలోని సముద్రతీరానికి మూడు అనుమానాస్పద కంటైనర్లు కొట్టుకురావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పాల్ఘర్ జిల్లాలోని సత్పతి, షిర్గావ్ బీచ్‌లకు మూడు అనుమానాస్పద కంటైనర్లు కొట్టుకురావడంతో భద్రతా, విపత్తు నిర్వహణ సంస్థలను అలర్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సమాచారం అందుకున్న కోస్ట్‌గార్డ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని.. అవి ఎక్కడి నుంచి వచ్చాయి? అందులో ఏముందనే? కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. దీంతో తీర గ్రామాలను అలర్ట్ చేసి.. బీచ్‌ల వెంబడి ముమ్మరంగా పెట్రోలింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. సముద్రంలో అధిక ఆటుపోట్లు ఉండడం వల్ల ప్రస్తుతం కంటైనర్లను తెరవడం కష్టతరంగా మారిందని.. ఓ కంటైనర్ పాక్షికంగా మునిగిపోయిందని అధికారులు తెలిపారు. పోలీసులు, సముద్ర నిఘా అధికారులు, కోస్ట్ గార్డ్‌లు సమన్వయంతో పని చేస్తూ.. కంటైనర్లకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి షిప్పింగ్ లాగ్‌లు, తీరప్రాంత నిఘా డేటా ద్వారా దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఆగస్టులో ఒమన్ నుంచి వెళ్తున్న ఓ కార్గో షిప్ నుంచి దాదాపు 48 కంటెయినర్లు సముద్రంలో జారిపడ్డాయని.. ప్రస్తుతం అవే కొట్టుకొచ్చినవి అయ్యుంటాయని అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ఈ విషయంపై ఎటువంటి అధికారిక ప్రకటన లేదు. సముద్ర తీరాల్లో అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే ముట్టుకోవద్దని స్థానిక మత్స్యకారులు, తీర ప్రాంతాల్లోని గ్రామస్థులకు సూచించారు. ఆగస్టులో ఒమన్ నుంచి వెళ్తున్న ఓ కార్గో షిప్ నుంచి దాదాపు 48 కంటెయినర్లు సముద్రంలో జారిపడ్డాయి. కంటెయినర్లు అరేబియా సముద్రం గుండా మహారాష్ట్రలోని ఒడ్డుకు కొట్టుకువచ్చే సూచనలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కంటెయినర్లను లేదా సంబంధిత వస్తువులను గుర్తిస్తే భారత నావికాదళానికి, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని స్థానిక మత్స్యకారులు, తీర ప్రాంతాల్లోని గ్రామస్థులు, గస్తీ బృందాలకు అధికారులు సూచించారు.

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం    తెలుగు దిన పత్రిక



## మధురమైన జ్ఞాపకాలు మనల్ని వదిలిపోవు : రాశి ఖన్నా

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'తెలుసు కదా'. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తుండగా.. వైవా హర్ష కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నీరజ కోన దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీని పీపుల్ మీడియా బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. 'తెలుసు కదా' సినిమా అక్టోబర్ 17న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ విషయాన్ని తెలుపుతూ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కొన్ని ఫొటోలు షేర్ చేస్తూ "కొన్ని కథలు కెమెరాలు తిరగడం ఆగిపోయినా.. మధురమైన జ్ఞాపకాలు మనల్ని వదిలిపోవు. వాటిలో ఒకటి 'తెలుసు కదా'. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ నేను ఈ రోజు పూర్తి చేశాను. ఈ ప్రయాణా న్ని నాతో పాటు ముందుకు తీసుకెళ్లిన అత్యంత అద్భుతమైన చిత్ర బృందానికి నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను అని రాసుకొచ్చింది.

# మనం అంతర్జాతీయ స్థాయికి చేరబోతున్నాం

'మాకు పరిమితులు ఉండొచ్చేమో కానీ... మా ఆశయాలకు లేవు. అందుకే ఇంత పెద్ద సినిమాని మేం చేయగలిగాం" అన్నారు తేజ సజ్జా. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'మిరాయ్'. రితికానాయక్ కథానాయిక. మంచు మనోజ్ ముఖ్యభూమిక పోషించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సోమవారం రాత్రి విశాఖపట్నంలో విడుదలకి ముందస్తు వేడుక జరిగింది. బిగ్ టికెట్‌ని ఆవిష్కరించిన అనంతరం వేడుకని ఉద్దేశించి కథానాయకుడు తేజ సజ్జా మాట్లాడారు. "ఈ సినిమాతో ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నాం. యాక్షన్, అడ్వంచర్‌తోపాటు ఆశ్చర్యపోయే ఎన్నో విషయాలు ఉంటాయి. పిల్లలు మొదలుకొని అందరికీ నచ్చే సినిమా. మంచి సినిమా చేయాలనే ఒకే ఒక లక్ష్యంతో మేమంతా పనిచేశాం. తెలుగు చిత్ర పరిశ్రమలో ఒక నటుడు కావడమే పెద్ద విషయం. అలాంటిది చాలా దూరం వచ్చాను. ఆ విషయంలో ఆనందంగా ఉంది. ఇంకా ఎంతో దూరం వెళ్లాలి. అభిరుచి, తపన ఉన్న నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ ఈ సినిమా వెనకాల ఉండటంతోనే చేయగలిగాం. కార్తీక్ నాకు ఈ కథ చెప్పినప్పుడు, దీనివెనక ఇబ్బందులే చెప్పారు. ఇప్పటివరకూ ఎవ్వరూ చేయలేదు, మనం చేయాల్సి వస్తుందన్నారు. ఇదే కదా మనం చేయాల్సింది, ఇదే కదా మన ప్రేక్షకులకు ఇవ్వాల్సిందని రంగంలోకి దిగాం. ఆ తర్వాత మనోజ్



అన్న వచ్చారు. భవిష్యత్తులో రాబోతున్న సినిమాలతో మనం అంతర్జాతీయ స్థాయికి చేరబోతున్నాం. కుటుంబ కథతో, కుటుంబం కోసం చేసిన ఈ సినిమాని అందరూ తక్కువ ధరలకే చూసేలా ఏర్పాట్లు చేశాం" అన్నారు తేజ సజ్జా. ఈ కార్యక్రమంలో మంచు మనోజ్, కార్తీక్ ఘట్టమనేని, టి.జి.విశ్వప్రసాద్, రితికానాయక్, సుజిత్, గంటా శారద తదితరులు పాల్గొన్నారు.

# ఓజి కోసం 117 మంది మ్యూజీషియన్స్ కసరత్తు

పవన్ కల్యాణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ ఓజీ. సుజిత్ డైరెక్షన్‌లో పాన్ ఇండియా గ్యాంగ్ స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, ప్రకాశ్ రాజ్, శామ్, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఓజీతో బాలీవుడ్ యాక్టర్ ఇమ్రాన్ హష్మీ టాలీవుడ్ డెబ్యూ ఇస్తున్నాడు. ఈ మూవీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. కాగా థమన్ అదిరిపోయే అప్‌డేట్ అందించి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాడు. థమన్‌తోపాటు 117 మంది మ్యూజిషియన్స్ ఓజీ కోసం లండన్‌లోని అబ్బే రోడ్ స్టూడియోలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ రికార్డింగ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని స్టూడియో ఫొటోను షేర్ చేస్తూ అందరితో పంచుకున్నాడు థమన్. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జెట్ స్పీడ్‌లో కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు విడుదల చేసిన రెండు పాటలను అభిమానులు ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. మరోవైపు థర్డ్ సింగిల్ గురించి ఎక్జయిటింగ్‌గా ఎదురు చూస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన అప్‌డేట్ రానుంది. కాగా తొలిసారి తెలుగు ప్రేక్షకులను పలుకరిస్తుండటం. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఓజీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓజీ సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా తెలుగుతోపాటు పలు భారతీయ భాషల్లో విడుదల కానుంది. సెప్టెంబర్ 25న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈనేపథ్యంలో కొన్ని రోజులుగా వరుస అప్‌డేట్‌లు, పోస్టర్లతో సోషల్ మీడియాలో చిత్రబృందం సందడి చేస్తోంది. తాజాగా తమన్ ఓ మ్యూజికల్ అప్‌డేట్ పంచుకున్నారు. ఇప్పటికే ఈ సినిమా కోసం జపాన్ వాయిద్య పరికరం కోటోను ఉపయోగించి బీజీఎం క్రియేట్ చేసినట్లు తెలిపిన ఆయన తాజాగా మరో పోస్ట్‌తో ఫ్యాన్స్‌లో జోష్ నింపారు. తమన్ పోస్ట్‌తో హ్యాష్ ట్యాగ్ మరోసారి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చింది. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇందులో పవన్ (శూశ ఔశశా) ఇప్పటివరకూ ఎన్నడూ చూడని పాత్రలో ఓజాస్ గంభీర అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ఆయన సరసన ప్రియాంకా మోహన్ నటించారు. ఇమ్రాన్ హష్మీ విలన్. శ్రియారెడ్డి, ప్రకాశ్‌రాజ్, అర్జున్‌దాస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం దీని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.






# మల్లెపూలు గొల్లుమన్నవి

### ఎయిర్‌పోర్టులో నటి నవ్యకు లక్ష జరిమాన

మల్లెపూలు తీసుకెళ్లినందుకు.. ఓ నటికి రూ. 1.14 లక్షల జరిమానా విధించిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఓ ఈవెంట్‌కు హాజరయ్యేందుకు మలయాళ నటి నవ్య నాయర్ ఆస్ట్రేలియా వెళ్లారు. ఆ సమయం లో తన బ్యాగులో నవ్య మల్లె పూలను తీసుకెళ్లారు. మెల్‌బోర్న్ ఎయిర్‌పోర్టులో వాటిని గుర్తించిన సిబ్బంది అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. అక్కడి అధికారులు ఆమెకు రూ. 1.14లక్షల జరిమానా వేశారు. ప్రపంచంలోని అత్యంత కఠినమైన బయోసెక్యూరిటీ చట్టాలు ఉన్న విమానాశ్రయాల్లో



ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ ఎయిర్‌పోర్టు ఒకటి. ప్రయాణికులు పండ్లు, విత్తనాలు, పూలను తీసుకువెళ్లడం అక్కడ నిషిద్ధం. వాటివల్ల ప్రయాణికులకు వివిధ రకాల వ్యాధులు, తెగుళ్లు సులభంగా వ్యాపించే అవకాశం ఉండడంతో ఈ నిబంధన పెట్టారు. నవ్య మెల్‌బోర్న్ విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం అక్కడి కస్టమ్స్ అధికారులు ఆమె బ్యాగ్‌లో మల్లెపూలును తీసుకువచ్చినందుకు జరిమానా విధించడంతో నటి లక్ష రూపాయలు చెల్లించింది. అనంతరం మెల్‌బోర్న్‌లో జరిగిన ఓనం కార్యక్రమంలో నటి నవ్య తనకు ఎదురైన అనుభవాన్ని చెప్పడంతో ఈ విషయం బయటకు వచ్చింది. తాను తీసుకువచ్చిన పూలు లక్ష రూపాయలు ఖరీదైనవని జరిమానా విధించేవరకు తనకు తెలియదని చమత్కరించింది.

# కమల్, రజనీల మల్టీస్టార్ మూవీ

### కమల్ హాసన్ ఆసక్తికర వివరాలు

కోట్ల మంది సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న మల్టీస్టారర్ అధికారికమైంది. ఇండస్ట్రీలో అగ్ర కథానాయకుల్లో ముందు వంసలో ఉండే కమల్‌హాసన్, రజనీకాంత్‌లు ఇప్పుడు 46 ఏళ్ల తర్వాత కలిసి స్క్రీన్‌పై కనిపించనున్నారు. వీరిద్దరి కాంబోలో మల్టీస్టారర్ రానుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాను కమల్‌హాసన్ అధికారికంగా ప్రకటించారు. దీంతో వీరి అభిమానులు సంబరపడుతున్నారు. ఇటీవల జరిగిన సైమా అవార్డుల వేడుకలో కమల్‌హాసన్ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. మీరు, రజనీకాంత్ కాంబినేషన్‌లో ఓ సినిమాను ఆశించవచ్చా అని వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు ఆయన ఆసక్తికర సమాధానమిచ్చారు. ప్రేక్షకులు మా కాంబినేషన్‌ను ఇష్టపడితే మంచిదే కదా.. వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. మేమిద్దరం కలిసి నటించాలని ఎన్నోఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాం. కానీ, ఇన్ని రోజులు అది కుదర్లేదు. త్వరలోనే మీ ముందుకు కలిసి రానున్నాం. అది మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తుందని స్పష్టంచేశారు. దీంతో ఈ బిగ్ మల్టీస్టారర్ అధికారికమైంది. అయితే, ఈ ప్రాజెక్ట్ వివరాలు మాత్రం ఆయన పంచుకోలేదు. ఇక వీరిద్దరి మధ్య అభిప్రాయబేధాలు ఉన్నాయంటూ వస్తోన్న వార్తలపై కూడా కమల్ స్పందించారు. 'మా మధ్య ఎలాంటి భేదాలు లేవు. ఇవన్నీ మీరు సృష్టించుకున్నవే. మేం ఎప్పుడూ ఒకరికి ఒకరం పోటీ అనుకోలేదు. మేమిద్దరం కలిసి నటించేందుకు అవకాశం కోసం ఎదురుచూశాం. ఒకరి సినిమాలు మరొకరం నిర్మించాలని కూడా ప్రయత్నం చేశాం అని కమల్ హాసన్ తెలిపారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వీరిద్దరి మల్టీస్టారర్ రానున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి.



లోకేశ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఓ సినిమాని తెరకెక్కించనున్నారని, రజనీ కమల్ ఇద్దరూ గ్యాంగ్‌స్టర్లుగానే సందడి చేయనున్నారని కోలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. ఇదే నిజమైతే 46 ఏళ్ల తర్వాత రజనీ కమల్ మళ్లీ కలిసి కెమెరా ముందుకువచ్చినట్టవుతుంది. ఈ ఇద్దరూ కలిసి 5 భాషల్లో 20కి పైగా సినిమాలు చేశారు. అయితే అదంతా 1970వ దశకంలోనే. ఆ తర్వాత ఈ ఇద్దరూ మళ్లీ తెరను పంచుకొనే అవకాశం రాలేదు. ఇన్నేళ్లకు లోకేశ్ రాసిన కథలో వీరు సందడి చేయనున్నట్లు తెలుస్తోంది.

# తిరుమల కిషోర్ దర్శకత్వంలో రవితేజ చిత్రం

### ఆర్‌టి 76 సినిమాకు అప్పడే ఓటిటి రైట్స్

బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్ లో పెడుతున్నాడు మాస్ మహారాజ. ప్రస్తుతం భాను భోగవరపు దర్శకత్వంలో చేస్తున్న మాస్ జాతర సినిమాకు ఫినిషింగ్ టచ్ ఇస్తున్నాడు. ఈ సినిమా ఈ ఏడాది అక్టోబరు 31న రిలీజ్ కు రెడీ అవుతోంది. మాస్ జాతర సెట్స్ పై ఉండగానే తన నెక్స్ట్ సినిమా కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రవితేజ ఇప్పుడు ఆ సినిమా షూటింగ్ కు రెడీ అవుతున్నాడు. నేనుశైలజా, చిత్రలహరి వంటి సూపర్ హిట్ సినిమాలను డైరెక్ట్ చేసిన కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. రవితేజ కెరీర్ లో 76వ సినిమాగా వస్తున్న ఈ సినిమాలో రవితేజ కామెడీ, కిషోర్ టేకింగ్ లో ఉండే ఎమోషన్స్ తో కలగలిపి పర్ఫెక్ట్ యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ సినిమాగా రాబోతోంది. ఇదిలా ఉండగా ఈ సినిమా డిజిటల్ రైట్స్ డీల్ క్లోజ్ అయింది. ప్రముఖ ఓటీటీ నిర్మాణ సంస్థ జీ5 రవితేజ కిషోర్ తిరుమల సినిమా ఓటీటీ రైట్స్ తో పాటు శాటిలైట్ రైట్స్ ను కూడా కొనుగోలు చేసింది.




ఇంకా టైటిల్ కూడా అధికారకంగా ప్రకటించని సినిమా ఓటీటీ రైట్స్ అమ్ముడయ్యాయి అంటే జాక్ పాట్ అనే చెప్పాలి. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమా అక్టోబర్ నెలాఖరుకు మొత్తం వర్క్ కానుంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా రిలీజ్ కానున్నఈ సినిమాలో ఆషిక రంగనాథ్ హీరోయిన్ గా నటిస్తున్నఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్ తో ఊరు సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారు.

# చిత్ర పరిశ్రమలో ఎవరి స్వార్థం వారిదే

### కిష్కింధపురి హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్

ఇండస్ట్రీలో మన అనుకునే వాళ్లు ఉండరని ఎవరి స్వార్థం వారిదని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. శ్రీనివాస్ ప్రధానపాత్రలో తెరకెక్కిన చిత్రం కిష్కింధపురి ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు ఇండస్ట్రీలో స్నేహితులు లేరని తెలిపారు. నేను ఓపెన్‌గా ఉంటాను. మనసులో ఏదో పెట్టుకొని ఇలా మాట్లాడితే, ఆటిట్యూడ్ చూపిస్తే అభిమానులు పెరుగుతారేమోనని ఎప్పుడూ లెక్కలు వేసుకొని మాట్లాడలేదు. భైరవం కంటే ముందు చాలా తక్కువగా మాట్లాడేవాడిని. ఈ మధ్య ఎక్కువగా మాట్లాడుతున్నాను. ఇండస్ట్రీకి వచ్చినప్పటి నుంచి ఒకేలా ఉన్నాను. మనసులో ఏదైనా ఉంటే నిద్రరాదు.. ఏవేవో ఆలోచనలు వస్తుంటాయి. అందుకే ఓపెన్‌గా ఉంటా. నేను ఎవరి విషయంలోనైనా బాధపడితే వాళ్లకు మొహం మీదే చెప్పేస్తానని ఒప్పుకున్నారు. ఇండస్ట్రీలో ఎవరి స్వార్థం వాళ్లకు ఉంటుంది. మన అనే వాళ్లు ఎవరూ ఉండరు. ఇదొక సముద్రం లాంటిది. లోతు ఎంత అనేది దీనిలో దిగిన వాళ్లకు మాత్రమే తెలుస్తుంది. ఇండస్ట్రీలో కూడా ఫ్రెండ్స్ ఉండి ఉండొచ్చు.. కానీ, బయట ఉన్నంత స్వచ్ఛంగా ఇక్కడ ఉండరు. మనతో బాగుంటారు.. మనం పక్కకి వెళ్లగానే మన గురించి మరోలా మాట్లాడతారు. నేనెప్పుడూ ఎవరి గురించి తప్పుగా మాట్లాడను. చిన్నప్పటి నుంచి అంతే. గాసిప్స్ కూడా విననని అన్నారు. ప్రేక్షకులు థియేటర్‌కి రావడం లేదనేది చాలా మంది చెబుతున్న మాట. కానీ, మంచి సినిమా అయితే కచ్చితంగా వస్తారని నేనెప్పుడూ నమ్ముతా. ఓ మంచి కథతోనే మా కిష్కింధపురి తెరకెక్కింది. ఆద్యంతం ఈ చిత్రం థ్రిల్‌ని పంచుతుంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com